## రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి

-ఉపకులపతి దండ రాజిరెడ్డి

**ములుగు, అక్టోబరు 11, ప్రభాతవార్త:**

రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని, ఉద్యాన పంటల ఉత్పత్తి ఇప్పటికే 350 మిలియన్ టన్నులకు చేరిందని, ఇది సాధారణ వ్యవసాయం కంటే ఎక్కువ అని ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. శనివారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోడి ప్రధానమంత్రి దంత్యాన్ కృషియోజన పథకాన్ని ప్రారంభించగా ములుగులోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో కార్యక్రమాన్ని శాస్త్రవేత్తలతోకలిసి వీక్షించారు. ఈసందర్భంగా దండ రాజిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంచి పథకాలను, రాయితీలను వినియోగించుకొని రైతులు లాభాల దిశలో ఉండాలని సూచించారు. ప్రధానమంత్రి మోడీ తన ప్రసంగం ద్వారా రైతులకు వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడానికి, ఉత్పాదకతను, రైతుల ఆదాయాన్ని పెంచడానికి ఈ పథకం అమలుచేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారని అన్నారు. కార్యక్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయ అధికారి డీన్, డైరెక్టర్ డా. సురేష్‌కుమార్, డా. మల్లేష్, రైతులు, విద్యార్థులు, బోధనాసిబ్బంది పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## కులగణన సర్వే నివేదిక ప్రజలకు అందుబాటులో ఉంచాలి

-ఎన్‌సి. సంతోష్

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే రిపోర్ట్ ఇప్పటికైనా ప్రజలకు అందుబాటులో ఉంచాలని సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్ అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హైకోర్టు ఆరువారాల సమయం ఇవ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లుతెరిచి బిసిలకు 42శాతం రిజర్వేషన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో కల్పించి న్యాయం చేయాలన్నారు. తమిళనాడు తరహాలో 50 శాతాన్ని మించి రిజర్వేషన్ అమలుచేయాలన్న అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత లాగా 69 శాతం రిజర్వేషన్ కేంద్రప్రభుత్వం మెడలువంచి కోర్టు కేసులను కూడా అధిగమించి రిజర్వేషన్ సాధించాలన్నా మీరు చెప్పుకుంటున్న శాస్త్రీయ పద్ధతిలో చేపట్టిన సర్వేలోని అన్నివర్గాల గణాంకాలను ప్రజలకు అందుబాటులో ఉంచి ప్రజల అభిప్రాయాలను సేకరించి అన్ని అపోహలు తొలగించగలిగితే కోర్టు కేసులు అధిగమించవచ్చని, 9వ షెడ్యూల్‌లో పెట్టే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని డిమాండ్ చేశారు.

## టెట్ నుండి పూర్తి మినహాయింపు ఇవ్వాలి



మాట్లాడుతున్న టిటియు జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

**సదాశివపేట, అక్టోబరు 10, ప్రభాతవార్త:**

సర్వీస్‌లోని ఉపాధ్యాయులకు టెట్ నుండి పూర్తిగా మినాయింపు ఇవ్వాలని టిటియు జిల్లా అధ్యక్షులు పి.ప్రసాద్ అన్నారు. శనివారం జిల్లాపరిషత్ పోతిరెడ్డిపల్లి పాఠశాలలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగవిరమణకు ఐదేళ్లకు మించి సర్వీసు ఉన్న ఉపాధ్యాయులందరూ రెండేళ్లలో తప్పనిసరిగా ఉపాధ్యాయ అర్హతపరీక్ష టెట్ ఉత్తీర్ణులు కావాలని లేదా ఉద్యోగంనుండి రిటైర్‌కావాలని సుప్రీంకోర్టు సెప్టెంబర్ ఒకటో తేదీన ఇచ్చిన తీర్పు ద్వారా దేశవ్యాప్తంగా 25లక్షలమంది టీచర్లపై ప్రభావంచూపుతోందని అన్నారు. 25సంవత్సరాల సర్వీసు పూర్తిచేసిన ఉపాధ్యాయుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తీర్పును పునఃసమీక్షించాలని కోరారు. వెంటనే తెలంగాణ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేసి ఉపాధ్యాయులకు అండగా నిలవాలని టిటియు సంగారెడ్డి జిల్లా పక్షాన కోరుతున్నామన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రవికుమార్ మాట్లాడుతూ ఆగస్టు 2010తర్వాత నియామకమైన ఉపాధ్యాయులకు మాత్రమే టెట్‌ను తప్పనిసరి చేస్తూ విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23లో స్పష్టత ఇచ్చేవిధంగా చట్టాన్ని సవరించాలని గత 15 సంవత్సరాలుగా ఎన్‌సిటిఈ, ఆయా రాష్ట్రప్రభుత్వాలు విద్యాహక్కు చట్టం2009 అమలుకు పూర్వం నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ అవసరమని చెప్పలేదని పైగా 2010కి ముందు నియామకమైన వారికి టెట్టు మినహాయింపు ఇచ్చినట్లు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించారని అందుకే సీనియర్ టీచర్లు ఇప్పటివరకు టెట్ పాస్‌కావాలనే ఆలోచన చేయలేదని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శులు రాములు, కోటేశ్వర్, మహిళా కార్యదర్శి సుమాలిని తదితరులు పాల్గొన్నారు.

## దళిత, ప్రజా, ఉపాధ్యాయ జెఎసి సంఘాల నిరసన ర్యాలీ

-సిజెఐ గవాయిపై దాడిని తీవ్రంగా ఖండించిన జెఎసి సంఘాలు




గజ్వేల్‌లో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న జెఎసి నాయకులు

**గజ్వేల్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**

భారతదేశ న్యాయవ్యవస్థలో అత్యున్నతస్థానంలో ఉన్న సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ బిఆర్.గవాయిపై సనాతనధర్మం ముసుగులో జరిగిన మనువాదదాడిని తీవ్రంగా ఖండిస్తూ శనివారం గజ్వేల్ పట్టణంలో దళిత, ప్రజాసంఘాలు, ఉపాధ్యాయసంఘాలతోపాటు వివిధ కుల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో పెద్దయెత్తున నిరసనర్యాలీ చేపట్టారు. ఇందిరాపార్కు చౌరస్తా నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి న్యాయవాది రాకేశ్‌కిషోర్‌ను చట్టపరంగా శిక్షించి వెంటనే అరెస్ట్‌చేయాలని నినాదాలుచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశ న్యాయవ్యవస్థ చరిత్రలో చీకటిరోజు అని, భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ స్వతంత్ర, లౌకిక ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగానే భావిస్తున్నామన్నారు. ఇంతకాలం అవమానాలు, అణిచివేతలకు గురైన వర్గాల ప్రజలే ప్రస్తుతం దేశాన్ని పాలించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ రామచంద్రం, చుంచు నరేందర్, శ్రీనివాస్, పంబాల ఎల్లయ్య, రాజులు, సత్యనారాయణ, యుటిఎఫ్ వలిఅహ్మద్, సత్యనారాయణ, అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు అటుకూరి రాములు, కిష్టయ్య, కృష్ణ, చిప్పల యాదగిరి, పొన్నాల కుమార్, తుమ్మ శ్రీనివాస్, దాసరి ఏగొండస్వామి, సందబోయిన ఎల్లయ్య, గడియారం స్వామిచారి, నీరుడి స్వామి, యాదగిరి, మహేష్, బ్యాగరి వేణు, చందు, రాజేశం, శివ, న్యాయవాదులు పంబాల ఎల్లం, ఖాశీం, శివ, ప్రశాంత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## ముమ్మరంగా మిషన్‌భగీరథ పైప్‌లైన్ లీకేజ్ మరమ్మతు పనులు

-మంత్రి ఆదేశాలమేరకు కదిలిన ఇంజనీరింగ్‌శాఖ అధికారుల యంత్రాంగం



ముమ్మరంగా సాగుతున్న మిషన్‌భగీరథ పైప్‌లైన్ లీకేజ్ మరమ్మతు పనులు

**నర్సాపూర్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**

ఇటీవల కురిసిన భారీవర్షాలకు సింగూరు జలాలు విడుదల చేయడంతో మంజీరానది పరీవాహక తీరంలోగల ప్రధాన పైప్‌లైన్ లీకేజీకావడంతో నర్సాపూర్ నియోజకవర్గంలోని తాగునీరు సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడడంతో నర్సాపూర్ నియోజకవర్గంలోని తాగునీటిసమస్య పరిష్కారానికి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి హైదరాబాదులోని జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రికి వివరించి నీటిసమస్య పరిష్కారానికి తక్షణచర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ఇందుకు మంత్రి వివేక్ వెంకటస్వామి స్పందించి నీటి సరఫరా సమస్యను పరిష్కరించేందుకు జిల్లా ఇంజనీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డికి నీటి సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీచేయడంతో సంబంధితశాఖ అధికారులు ఇంజనీరింగ్‌విభాగ సిబ్బంది పర్యవేక్షణలో ముమ్మరంగా పైప్‌లైన్ లీకేజ్ మరమ్మతు పనులు సాగుతున్నాయి. నర్సాపూర్ నియోజకవర్గంలో తాగునీరు సరఫరా త్వరలోనే పునరుద్ధరించబడుతుందని అధికారులు తెలిపారు.

## సర్కార్ ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా రాజీలేని పోరాటాలు చేస్తాం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించడంతోపాటు ప్రమాదబీమా సౌకర్యం రూ.10 లక్షలు కల్పించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల్‌స్వామి అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం జిల్లా మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) 4వ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా జెండా ఆవిష్కరణచేసి మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు ఉద్యోగభద్రతతోపాటు పదవీవిరమణ పొందిన తర్వాత పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. గత పాలకులు మున్సిపల్ కార్మికులను పట్టించుకున్న పాపానపోలేదని నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ సైతం అదేబాటలో నడుస్తుందన్నారు. పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలోపెట్టుకొని కార్మికులకు తక్షణమే రూ.26వేల కనీస వేతనం చెల్లించాలన్నారు. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడానికి తమ ఆరోగ్యాలను సైతం లెక్కచేయకుండా శ్రమిస్తున్న కార్మికులకు ఈఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో సర్కార్ ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా సమస్యలు పరిష్కరించేవరకు రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యకు కేరాఫ్ అడ్రస్ మంజీర

-శివంపేట వద్ద కనిపించని రక్షణచర్యలు

-పట్టించుకోని ఎన్‌ఎహెచ్‌ఎఐ, పోలీసులు

**చౌటకూరు, అక్టోబరు 11, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని శివంపేట గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న మంజీరానదిపై నిర్మించిన వంతెన ఆత్మహత్యకు కేరాఫ్ అడ్రస్‌గామారింది. పోలీసుల వేధింపులు, కుటుంబకలహాలు, మద్యానికి బానిసవడం, జీవితాలపై విరక్తిచెందిన తరుణంలో క్షణికావేశంలో తానుపోతే తనకుటుంబం రోడ్డు పాలవుతుందని ఆలోచించకుండా వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఒక మాసం, పక్షంరోజుల్లో ముగ్గురు వ్యక్తులు వంతెనపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం పాఠకులకు విదితమే. ఇటీవల కురిసిన భారీవర్షాలతో సింగూరుప్రాజెక్టు, మంజీర రిజర్వాయర్‌లకు వరదప్రవాహం పోటెత్తడంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయరహదారి మంజీరానదిపై 6 వరుసలుగా వంతెనను నిర్మించి ఉన్నారు. క్షణికావేశంలో మంజీరానదిలో దూకి గల్లంతవడంతో, గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభించక కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కళ్లలోవత్తులు వేసుకుని ఎదరుచూపులు చూస్తుండటం, శవం ఆచూకీ కోసం పోలీసులు, రిస్కు టీం బాధ్యులు రోజుల తరబడి గాలింపులు జపుతూ అవస్థలు పడాల్సి వస్తోంది.

**మద్యం మత్తులో...**

శివంపేటగ్రామానికి చెందిన బడంపేట మల్లాగౌడ్ మద్యానికి బానిసై తరుచూ భార్యతో గొడవలు పడుతూ ఆగస్టు 29న తాగిన మైకంలో మంజీరా నదిలో దూకగా మల్లాగౌడ్ శవం ఈ నెల 3న సంగారెడ్డి మండలం గౌడిచర్ల గ్రామశివారులో ప్రవహిస్తున్న మంజీరానది తీరప్రాంతాల్లో 35 రోజుల తర్వాత కుళ్లిపోయిన స్థితిలో లభ్యమయిన విషయం పాఠకులకు విదితమే. నదిలో దూకి గల్లంతయిన మల్లాగౌడ్ శవం ఆచూకీ దొరకకపోవడంతో కుటుంబసభ్యులు చివరిచూపుకు నోచుకోకుండా పార్థివదేహం లేకుండానే కర్మకాండను పూర్తి చేసుకోవాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు.

**పోలీసుల వేధింపులు తాళలేక...**

నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణానికి చెందిన అల్లె లోకచంద్ర క్లింకార యూట్యూబ్ చానెల్ సిఈవోగా పనిచేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారంచేస్తూ, లాడ్జీల నిర్వహణచేస్తూ కుటుంబాన్ని సాకుతున్నాడు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని లాడ్జిని అద్దెకు తీసుకుని నిర్వహిస్తూ వస్తుండగా మండలంలోని వెండికోలు గ్రామానికి చెందిన సిరిపురం లక్ష్మణ్ సెప్టెంబరు 28న సదరు లాడ్జిలో అనుమానాస్పదంగా మృతిచెందాడు. సంగారెడ్డి రూరల్‌పోలీసులు లాడ్జిని నిర్వహిస్తున్న అల్లె లోకచంద్రను ప్రత్యక్షసాక్షిగా చూపుతూ కేసు నమోదుచేశారు. కేసువిషయమై సంగారెడ్డి రూరల్ ఎస్‌ఐ రవీందర్ డబ్బులు డిమాండ్‌చేస్తూ మానసికంగా వేధిస్తున్నాడంటూ లోకచంద్ర తనభార్యకు ఆడియోరికార్డును వాట్సప్ ద్వారా పంపి సెప్టెంబరు 30న శివంపేట శివారులోని మంజీరానది వంతెనపై దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసినదే. నదిలో దూకి గల్లంతైన లోకచంద్ర ఆచూకీకోసం ఎస్డిఆర్‌ఎఫ్ రెస్క్యూ బృందాలు, ఎయిర్‌బోట్లు, డ్రోన్ కెమెరాలతో గాలించినా ఫలితం లేకుండాపోయింది. లోకచంద్ర కుటుంబ సభ్యులు సైతం మల్లాగౌడ్ కుటుంబీకుల్లా పార్థివదేహం లేకుండానే చివరిచూపుకు నోచుకోకుండానే కర్మకాండలు పూర్తిచేసుకున్నారు.

**జీవితంపై విరక్తి చెంది...**



శివంపేట శివారులోని మంజీరానదిపై వంతెన దృశ్యం

శివంపేట గ్రామానికి చెందిన బండోల్ల మల్లేశం కట్టుకున్న భార్య అలిగి పుట్టింటికి పోవడంతో రెండవ వివాహం చేసేందుకు కుటుంబ సభ్యులు, మిత్రులు సమయం కావాలని సర్దిచెప్పినా అవేమీ పట్టించుకోకుండా జీవితంపై విరక్తిచెంది ఈ నెల 8న మంజీరానదిలో దూకి గల్లంతయిన విషయం విదితమే. 12రోజుల క్రితం మంజీరానదిలో గల్లంతయిన లోకచంద్ర ఆచూకీకోసం గాలింపు చర్యలు చేపడుతుండగానే మరోవ్యక్తి నదిలోదూకి గల్లంతు కావడంతో, గాలింపుకోసం పోలీసులకు కంటిమీద కునుకు లేకుండాపోయిందని ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అవసరంలేదు.

**వంతెనపై కరువైన రక్షణచర్యలు...**

శివంపేట గ్రామశివారులోని మంజీరానదిపై నిర్మించిన వంతెన వద్ద రక్షణ చర్యలు కరువయ్యాయి. వంతెనపైనుంచి నదీజలాలు కనిపించకుండా, కిందకుదిగడానికి అవకాశంలేకుండా రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వంతెన రెయిలింగ్ గోడపైకి మనుషులుపోకుండా పకడ్బందీగా రక్షణచర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎన్‌ఎహెచ్‌ఎఐ అధికారులు, పోలీసులు స్పందించేలా జిల్లాకలెక్టర్ ప్రత్యేకచొరవ తీసుకోవాలని ప్రజలు వినతి చేస్తున్నారు.

**క్షణికావేశంతో కుటుంబాలు రోడ్డుపాలు...**

ప్రతిమనిషి జీవితంలో కష్టసుఖాలు వస్తూ, పోతూ ఉంటాయి. చీకటి వెనుక నీడ ఉన్నట్లుగా కష్టం వెనుక సుఖం ఉంటుందని తెలుసుకోకుండా ఏదో కష్టం వచ్చిందని క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడితే తాను లేకుండా తమ కుటుంబ సభ్యుల జీవనం ఎలా ఉంటుందో గుర్తుంచుకోవాల్సిన అవసరం ఆత్మహత్యకుముందు గ్రహిస్తే ఆత్మహత్యకు దూరంగా ఉండే అవకాశాలు ఉంటాయి. తను అనుభవిస్తున్న కష్టాలకన్నా సమాజంలో అనేకులు అధికంగా కష్టాలుపడుతున్నట్లు గ్రహిస్తూ తామనుభవిస్తున్న కష్టాలు కడతేరేలా చూసుకుని జీవనం సాగించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

## అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలి

-జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



పిహెచ్‌సిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**చిన్నశంకరంపేట, అక్టోబరు 11, ప్రభాతవార్త:**

రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం చిన్నశంకరంపేట పట్టణంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. జ్వరంతో బాధపడుతున్న వారి రక్త నమూనాలను ప్రయోగశాలకు పంపాలని తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. వైద్యం అందించడంలో సిబ్బంది సహకరిస్తున్నా రని రోగులు తెలుపడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. హాజరు పట్టికను పరిశీలించి సమయపాలన పాటించాల న్నారు. జిల్లాలో మందులకొరత లేదని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆయన పేర్కొన్నారు.

**మెనూ ప్రకారం భోజనం అందించాలి...**

పట్టణంలోని ఎస్టీ వసతిగృహాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగితెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, విద్యార్థులను ప్రతి రోజు పాఠశాలకు పంపాలని సూచించారు. విద్యార్థులను ప్రశ్నలను అడిగి సమాధానాలను రాబట్టారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

## పంచాయతీలను పట్టించుకునే నాథుడే కరువు

-అగమ్యగోచరంగా మారిన గ్రామపంచాయతీ వ్యవస్థ

-ప్రజాప్రతినిధులు లేక పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

**నర్సాపూర్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**

గ్రామాల్లో గ్రామపంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం గడిచిన తదుపరి గ్రామాల్లో పెద్దదిక్కు లేక పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గ్రామ పంచాయతీలో ప్రజాప్రతినిధులు లేక పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఈ మేరకు గ్రామ పంచాయతీలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో మండల పరిధిలోని గ్రామాల పరిస్థితి అధ్వాన్నంగా తయారయింది. గ్రామపంచాయతీ బాగుపడాలంటే పంచాయతీ పాలకవర్గం ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ పాలకమండలి ఎన్నికలు నిర్వహించకపోగా గ్రామాలపరిస్థితి అథోగతి పాలయ్యింది. గ్రామపంచాయతీల్లో పాలకవర్గం లేకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యంలోపించి ఎక్కడి చెత్త అక్కడే ఉంటూ మురికి కాలువలు కూడా పరిశుభ్రం చేసే పరిస్థితి కనబడటంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నెలలు గడుస్తున్నా స్థానికసంస్థలు ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. కాగా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగా బిసిల 42శాతం రిజర్వేషన్‌లు అడ్డుతగిలి హైకోర్టు స్టే విధించింది. దీంతో



గ్రామాల్లో వెలవెల బోయిన గ్రామ పంచాయతీ కార్యాలయం దృశ్యం

స్థానికసంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో అని ప్రజలు అయోమయస్థితిలో ఉన్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గంతోటే గ్రామాలన్నీ అభివృద్ధిచెందుతాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారా లేదా అని గ్రామాల ప్రజలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

## ఇదేనా పారిశుధ్య నిర్వహణ?

-అపరిశుభ్రతకు ఆనవాలుగామారిన రోడ్డు



మురికినీరు, ఇరువైపులా పొదలతో నిండిన రోడ్డు

**జోగిపేట, అక్టోబరు 11, ప్రభాతవార్త:**

పారిశుధ్యంపై ప్రత్యేకచొరవ తీసుకుంటున్నామని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నప్పటికీ ఆచరణలోమాత్రం తూతూ మంత్రంగా పారిశుధ్యనిర్వహణ కొనసాగుతుంది. వందరోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా మున్సిపల్ అధికారులు అన్ని వార్డులలో పారిశుధ్య నిర్వహణ, మొక్కల పెంపకం తదితర కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఇంకా కొన్నిచోట్లు అపరిశుభ్రతకు ఆనవాళ్లుగా తయారయ్యాయి. పరిసరప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నా, కొన్ని ప్రాంతాలుమాత్రం మురికినీటికూపాలుగా తయారవుతున్నాయి. జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 13వార్డులో ఆకుల శివలింగం ఇంటి మూలమలుపువద్ద చేనేతసంఘం పక్కనుంచి ఉన్న సిసిరోడ్డుపై పూర్తిగా మురికినీరుపేరుకుపోయి, అటు నుంచి వెళ్లడానికే ఇబ్బందిపడాల్సి వస్తుంది. ఇదేస్థలంలో గత పది రోజులక్రితం భారీవర్షం కురియటంతో అక్కడ మురికినీరు భారీస్థాయిలలో నిలిచి సిసి రోడ్డు మునిగి, రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తాత్కాలికంగా జెసిబితో కాలువ తీయటంతో ఆపరిస్థితి తొలగిపోయినా, ఆస్థలంలో పూర్తిగా మురికినీరు నిలిచి దుర్గంధంవస్తుంది. అంతేకాకుండా చెత్తాచెదారాలు కూడా అక్కడే వేస్తున్నారు. సిసిరోడ్డుకు ఇరువైపులా భారీస్థాయిలో పొదలు పెరగటంతో రాత్రిపూట అటు తిరగడానికి భయపడుతున్నారు. తగిన చర్యలు చేపట్టాలని వార్డుసభ్యులు కోరుతున్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు



అంతర్గామ్‌లో పోలీసుల అదుపులో పేకాట ఆడుతున్న జూదరులు

**సిర్గాపూర్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని అంతర్గామ్‌లో గుట్టు చప్పుడు కాకుండా మూడుముక్కలాట ఆడుతున్న పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ మహేష్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఐ మహేష్‌కుమార్ కథనం ప్రకారం, ఏడుగురు వ్యక్తులు జూదం ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బంది సీతారాం, విష్ణు, ఫర్తాన్‌లతో జూదగృహంపై దాడిచేసి జూదరులు తమ కాళ్లకు పనికల్పించే అవకాశం లేకుండా ఆదుపులోకి తీసుకున్నామన్నారు. జూదరుల నంచి 3సెల్ ఫోన్లు, 52 పేకముక్కలు, 3250 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. మండలంలోని ఏదేని గ్రామంలో పేకాట ఆడుతున్నట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్‌ఐ మహేష్‌కుమార్ వివరించారు.

## ఇంటిముందు పార్క్‌చేసిన బైక్ దగ్ధం...

**వెల్దుర్తి, అక్టోబరు 11, ప్రభాతవార్త:**



దగ్ధమైన బైక్ దృశ్యం

మండలంలోని కుకునూరు గ్రామంలో ఇంటిముందు పార్క్‌చేసిన బైకు దగ్ధమైన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. కుక్కునూరు గ్రామానికిచెందిన చాకలి నాగులు తనబైక్ శుక్రవారంరాత్రి ఇంటి ముందు పార్క్‌చేసి నిద్రించారు. రాత్రి 12 గంటలకు బైక్ మంటలు అంటుకొని దగ్ధం కావడంతో గమనించిన గ్రామస్థులు నాగులకు సమాచారం ఇవ్వడంతో పాటు మంటలను ఆపివేశారు. అప్పటికే బైకు పూర్తిగా దగ్ధంకావడంతో శనివారం ఉదయం బాధితుడు నాగులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు స్థానికపోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

## యువతిని నమ్మించి మోసగించిన ఇరువురిపై కేసు నమోదు

**ములుగు, అక్టోబరు 11, ప్రభాతవార్త:**

ప్రేమిస్తున్నాను, పెళ్ళిచేసుకుంటాను అని ఒకయువకుడు మోసంచేస్తే, మరోయువకుడు ఆయువతిని బ్లాక్‌మెయిల్ చేసి లొంగదీసుకున్న సంఘటన ఇది. ములుగు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఒక యువతిని ఆదే గ్రామానికి చెందిన ఉదయ్‌కిరణ్ అనే యువకుడు ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటాను అని మోసపూరిత వాగ్దానాలతో మోసంచేయడంతో, ఆయువతి గర్భందాల్చింది. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన మరో యువకుడు పవన్‌కళ్యాణ్ ఆ యువతిని బ్లాక్‌మెయిల్ చేసి లొంగదీసుకున్నాడు. ఈ క్రమంలో గత 13 రోజుల క్రితం ఆ యువతికి మరో వ్యక్తితో వివాహం జరిగింది. యువతికి కడుపులో నొప్పి రావడంతో తల్లికి సమాచారం అందించగా కూతురు వద్దకు వెళ్ళి ఏమైందని అడుగగా కూతురు నెలసరి రావడంలేదని తల్లితో తెలుపడంతో ఆసుపత్రికి తీసుకెళ్ళి పరీక్షలు చేయించింది. దీంతో ఆ యువతికి 7 నెలల గర్భం ఉన్నట్లు నిర్ధారణ కావడంతో గతంలో జరిగిన అన్ని విషయాలను తల్లికి చెప్పింది. దీంతో ఆ యువతి తల్లిదండ్రులు ములుగు పోలీసులను ఆశ్రయించి తమ కూతురును ఉదయ్‌కిరణ్, పవన్‌కళ్యాణ్ అనే ఇరువురు మోసంచేసి గర్భవతిని చేశారని తెలుపడంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

## కలసికట్టుగా బిజెపిని బలోపేతం చేయాలి



బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు సన్మానిస్తున్న దృశ్యం

**బేగంబజార్,అక్టోబర్ 11ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ స్థాయి నుంచి బిజెపిని మరింత బలోపేతం చేయాల్సిన భాధ్యత కార్యకర్తలు,నాయకులపై ఎంతైనా ఉందని నూతనంగా బిజెపిప్రధాన కార్యదర్శిగా పదవి భాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అన్నారు.ఈమేరకు ఆయనతెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ఇచ్చిన పదవి భాధ్యతలను చేపట్టారు. ఈసందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ బిజెపి ఫ్లోర్ లీడర్ గొంటి శంకర్‌యాదవ్ భారీ గజమాలతో గౌతమ్‌రావును సన్మానించారు.ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మానవ సేవలో అఫ్జల్‌గంజ్ పోలీసులు



ఫుట్‌పాత్‌లపై ఉంటున్న అనాథలను అమ్మ,నాన్న ఆశ్రమానికి పంపించిన సిఐ రవి

**అఫ్జల్‌గంజ్,అక్టోబర్ 11ప్రభాతావార్త:**

అనునిత్యం కత్తి మీద సాము చేసే పోలీసు విభాగంలో విధులను నిర్వహిస్తునే, మానవ సేవయే,మాధవ సేవా అనే నమ్మకంతో అఫ్జల్ గంజ్ పోలీసులు ఫుట్‌పాత్‌లపై నిద్రస్తున్న నలుగురు పురుష్యులు,ఒక మహిళా వివరాలను సేకరించి చౌటుప్పల్‌లోని అమ్మ,నాన్నఅనాథ స్వచ్ఛంద సంస్ధకు తరలించారు.ఈస్ట్‌జోన్ డిసిపి బాలస్వామి, సుల్తాన్‌బజార్ ఎసిపి ఎం.మట్టయ్యాల పర్యవేక్షణలో అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ రవినూనవత్ నేతృత్వంలో పోలీసు సిబ్బందినలుగురు పురుష్యులతో పాటు మహిళాను అమ్మ,నాన్న అనాథ ఆశ్రమం నిర్వాహకులకు అప్పగించారు.ఇన్‌స్పెక్టర్ రవి మాట్లాడుతూ సమాజంలో మానవ విలువలు నశించి పోతున్నాయన్నారు.అందరుఉండి కూడా కుటుంబంలోని తల్లి దండ్రులకు రెండు పుటాల భోజనం పెట్టకుండా ఇంటి నుంచి గెంటివేస్తున్నారన్నారు.ఫుట్‌పాత్‌పై ఉండి జీవించే కన్న అమ్మ,నాన్న ఆశ్రమానికి తరలిస్తే వారికి సమయానికి భోజనం దొరుకుతుందని ఆలోచనతో అక్కడి తీసుకువెళ్లి అప్పగించినట్లు చెప్పారు. నిర్వాహకులు ఎంతో సంతోషంతో వారిని ఆశ్రమంలో చేర్చుకున్నట్లు తెలిపారు. ఫుట్‌పాత్‌లపై జీవించుకు ఉండటం మూలంగా వారి జీవితాలకు భరోసా లేకుండా పోతుందనే ఆలోచనతో డిసిపి,ఎసిపి దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశాల మేరకు వారిని చౌటుప్పల్‌లోని అమ్మ,నాన్న అనా థ ఆశ్రమానికి తీసుకు వెళ్లిఅప్పగించం జరిగిందన్నారు.అందుకు డిసిపి బాలస్వామి,ఎసిపి మట్టయ్యలు పోలీసుల పనితీరును అభినందించారు.

## పికిల్‌బాల్‌కు అన్నివర్గాల నుంచి మంచి ఆదరణ

**హైదరాబాద్ పికిల్‌బాల్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ బాబు**



టోర్నిని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌బాబు తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 11,ప్రభాతవార్త:**

మహిళల, పురుషుల సింగిల్స్, డబుల్స్ సహ ఐదు విభాగాల్లో 200 మంది క్రీడాకారులు పోటీపడుతున్న పికిల్‌బాల్ ఓపెన్ టోర్నమెంట్ శనివారం ప్యాడిల్‌వేవ్ స్పోర్ట్స్ సెంటర్‌లో ప్రారంభమైంది. హైదరాబాద్ పికిల్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు దుద్దిళ్ల శ్రీనివాస్ బాబు రెండు రోజుల పాటు జరిగే రౌండ్ రాబిన్, నాకౌట్ టోర్నమెంట్‌ను అధికారికంగా ఆరంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ బాబు మాట్లాడుతూ.. పికిల్‌బాల్‌కు ఆరంభంలో కాస్త ప్రతికూల వాతావరణం కనిపించినా.. ప్రస్తుతం పికిల్‌బాల్‌కు అన్ని వర్గాల నుంచి మంచి ఆదరణ లభిస్తుంది. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతుంది. పికిల్‌బాల్‌ను మరింతగా విస్తరించేందుకు కృషి చేస్తానని ఖి అన్నారు. హైదరాబాద్ పికిల్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సుమిరన్ కొమ్మరాజు, కోశాధికారి శ్రీధర్, నిర్వాహకులు కార్తీక్, సత్యదీప్, మహేశ్ తదితరులు ఆరంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలి

**న- మహారాష్ట్ర ఉప సిఎల్‌పి నాయకులు అమిన్ పటేల్**



మహారాష్ట్ర ఉప సిఎల్‌పి నాయకులు,ఎమ్మెల్యే అమిన్ పటేల్‌ను కలిసిన పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు పులిపాటి రాజేష్ కుమార్,జి.కన్నయ్యలాల్,సయ్యద్ షా ముజాహిద్

**చార్మినార్,అక్టోబరు 11 ప్రభాతవార్త :**

హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నియామక ప్రక్రియ కోసం ఏఐసిసి పరిశీలకులుగా వచ్చిన మహారాష్ట్ర ఉప సిఎల్‌పి నాయకులు,ఎమ్మెల్యే అమిన్ పటేల్‌ను పాతబస్తీకి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.కాంగ్రెస్ నాయకులు తమ అభిప్రాయాలను తెలియజేశారు.ఈ సందర్బంగా మహారాష్ట్ర ఉప సిఎల్‌పి నాయకులు అమిన్ పటేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకోసం నాయకులు పని చేయాలని కోరారు.బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు .జి.కన్నయ్యలాల్,సయ్యద్ షా ముజాహిద్,సయ్యద్ ఇక్బాల్,ఎండి జబ్బార్,అలీషాన్, ఫయాజ్,బానుచందర్ యాదవ్,నషీర్ ఫారూఖ్,జాకీర్ హుస్సేన్,ఇర్ఫాన్,హమీద్ ఉద్దీన్, ఇబ్రహీం,అహ్మద్ పాల్గొన్నారు.

## టీచర్‌కు సైబర్ మోసం

**హైదరాబాద్,అక్టోబరు11,ప్రభాతవార్త :** ఆర్బీఐ, ఏఐ ద్వారా సిఫారస్ చేసిన స్టాక్స్‌ను కొని అధిక లాభాలు ఇప్పిస్తామంటూ నమ్మించి ఓ ప్రైవేట్ ఉపాధ్యాయురాలికి సైబర్‌నేరగాళ్లు రూ. 26.5 లక్షలు బురిడీ కొట్టించారు. మీర్‌పేట్ ప్రాంతానికి చెందిన బాధితురాలి వాట్సాప్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేయడంతో పేటీఎం స్టాక్స్ పేటీఎం మనీ క్యాఐబీ ట్రేడింగ్ కంపెనీ లైట్ ఆఫ్ నాలెడ్జ్ పేరుతో ఒక వాట్సాప్ గ్రూప్‌లో నెంబర్ యాడ్ అయ్యింది. గ్రూప్ అడ్మిన్‌గా యశ్విని జిందాల్ అనే పేరుతో ఒక మహిళా ఫోన్ చేసింది. మీకు ట్రేడింగ్‌లో ఎలాంటి సహాయం కావాలన్నా మేం చేస్తామంటూ సూచనలు చేసింది. తమ కస్టమర్ కేర్ నెంబర్లు ఉన్నాయంటూ మూడు నెంబర్లను పంపించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## బిర్లా సైన్స్ సెంటర్ ఒక అద్భుతం : బలరామ్ ప్రశంస



సింగరేణి పెవిలియన్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సింగరేణి సిఎండి ఎన్.బలరామ్.

**సైఫాబాద్, అక్టోబరు 11 ప్రభాతవార్త:** బిర్లా సైన్స్ సెంటర్‌లో జరుగుతున్న అసాధారణమైన పనులపై సింగరేణి కాలరీస్ కంపెనీ సిఎండి ఎన్.బలరామ్ ప్రసంసల వర్షం కురిపించారు. ఇది భవనం కాదని ఇది ఒక ఉత్సుకత, అభ్యాసానికి ఒక డైనమిక్ కేంద్రమని కొనియాడారు. అత్యాధునిక ప్లానిటోరియం, ఆకర్షనీయమైన గ్యాలరీలు, గొప్ప మ్యూజియంతో సహా వివిధ సౌకర్యాలను చూసే అవకాశం కలిగిందని చెప్పారు. ఇవి అమూల్యమైన వనరులు, అవి వాస్తవాలను ప్రదర్శించడం కంటే ఎక్కువగా చేస్తున్నాయని, సాధారణ ప్రజలు, విద్యార్థుల శాస్త్రీయ జ్ఞానాన్ని చురుకుగా నిమగ్నం చేస్తాయని, అలాగే తదుపరి తరం ఆవిష్కర్తలకు స్పూర్తినిచ్చేందుకు ఈ ఆచరణాత్మక అందుబాటులో ఉండే అభ్యాస అనుభవాలను అందించడం కీలకమని బలరామ్ తెలిపారు. ఈ సంస్థ సహజ ప్రపంచంలోని అద్భుతాలను నేరుగా ప్రజలకు అందిస్తున్నదని, ఇంత అద్భుతమైన ట్రాక్ రికార్డ్ ఉన్న సైన్స్ సెంటర్‌లో విలువైన కళాఖండాలను ప్రదర్శించడం గొప్ప విశేషమన్నారు. సింగరేణి మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని తవ్వకంలో లభించిన 110 లక్షల సంవత్సరాల నాటి స్టెగోడాన్ జాతి ఎనుగు దంతాల అవశేషాలు, డైనోసార్ కాలానికి చెందిన శిలాజ కలపను పొందుపరుస్తూ బిర్లా సైన్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సింగరేణి పెవిలియన్‌ను శనివారం జిపి బిర్లా పురావస్తు, ఖగోళ, వైజ్ఞానిక సంస్థ ఛైర్ పర్సన్ నిర్మల బిర్లాతో కలిసి బలరామ్ ప్రారంభించి మాట్లాడారు. బిర్లా ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ కె.మృత్యుంజయరెడ్డి మాట్లాడుతూ ఈ సంస్థ అభివృద్ధికి సహకరిస్తున్న ఇస్రో, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వంటి సంస్థల సరసన తాము కూడా చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

## భవన యజమాని వద్ద మాజీ కార్పొరేటర్ రూ.10.లక్షలు డిమాండ్

**-మాజీ కార్పొరేటర్‌కు రిమాండ్**
**- ఎమ్మెల్యేను కలిసినా వేధింపులు ఆపలేదన్న బాధితుడు**
**- అక్రమ వసూళ్లకు టిపిఓ సహకారం ఉందన్న యజమాని**



పోలీసులకు ఫిర్యాదు చేసిన భవన యజమాని నానాజీ



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మాజీ కార్పోరేటర్ శ్రీనాథ్‌రెడ్డి

**నార్సింగి, అక్టోబర్ 11 ప్రభాతవార్త :** భవన యజమాని వద్ద రూ.10. లక్షలు డిమాండ్ చేసిన మాజీ కార్పోరేటర్ కటకటాలపాలయ్యాడు. ఎస్.ఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం... గండిపేట మండలం నార్సింగి లోని ఓ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న నానాజీరావ్ హైదర్షాకోట్‌లో 213.గజాల ఇంటి స్థలం కొన్నాడు. ఆ ఇంటి పనులు మొదలు పెట్టగానే మాజీ కార్పోరేటర్ శ్రీనాథ్‌రెడ్డి వచ్చి మాకు 10. లక్షల డబ్బులు ఇస్తేనే ఇళ్ల కట్టాలని, లేదంటే కట్టనివ్వమని బెదిరించాడు. ఆ రోజు శ్రీనాథ్ నుండి తప్పించుకునేందుకు రూ.7లక్షలు ఇస్తానని నానాజీ చెప్పి వెళ్లిపోయాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో శ్రీనాథ్‌రెడ్డి గత నాలుగు నెలలుగా ఇంటి నిర్మాణం జరుగకుండా అడ్డుపడుతూనే ఉన్నాడు. నానాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి తన ఇబ్బందిని తెలుపుకున్నాడు. మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డిని కలువండి మీకు సహాయం చేస్తాడని ఎమ్మెల్యే చెప్పడంతో నానాజీ తిరిగి రాజేందర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిశాడు. అక్కడ 10.లక్షల నుంచి 42.నిమిషాల చర్చల అనంతరం చివరిగా రూ.4. 8.లక్షలు ఇచ్చి తీరాలని శ్రీనాథ్‌రెడ్డి డిమాండ్ చేశాడు. దీంతో రూ.3.లక్షల నగదు, రూ.లక్ష సందీప్ పేరుపై ఆన్‌లైన్‌లో నానాజీ ఇచ్చాడు. డబ్బులు తీసుకున్న తరువాత కూడా ఇళ్ల కట్టుకోనివ్వకుండా ఇబ్బంది పెడుతుండడంతో బాధితుడు నార్సింగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శ్రీనాథ్‌రెడ్డి, సందీప్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్.ఐ మల్లేష్ వివరించారు. ఈ కేసులో టిపిఓ రాకేష్, మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డిల పాత్ర ఏ మేరకు ఉందో దర్యాప్తు చేసిన తరువాత వెల్లడిస్తామని పోలీ సులు తెలిపారు.

**ఎమ్మెల్యేను కలిసినా వేధింపులు ఆపలేదు : బాధితుడు**

నా ఇబ్బందిని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లినా శ్రీనాథ్‌రెడ్డి వేధింపులు ఆపలేదని బాధితుడు నానాజీ రావ్ వాపోయాడు. నా ఇంటి నిర్మాణంకు అనుమతి ఇవ్వాలని పలుమార్లు బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ టిపిఓ రాకేష్‌ను కలిస్తే ముందు శ్రీనాథ్‌రెడ్డిని మేనేజ్ చేసుకో అని పదేపదే పేర్కొన్నాడని వివరించాడు. చట్టపరంగా నా వద్ద డాక్యుమెంట్లు తీసుకొని భవన నిర్మాణంకు అనుమతి ఇవ్వకుండా టిపిఓ కాలయాపన చేశాడని, శ్రీనాథ్‌కు డబ్బులు ఇచ్చి నా వద్దకు రావాలని నాకు పదేపదే చెప్పారని, ఈ డబ్బుల వసూళ్ల వెనుకాల టిపిఓ హస్తం కూడా ఉందని నానాజీ పేర్కొన్నారు. వీరి పోరు పడలేక ఎమ్మెల్యేను కలిస్తే ఆయన రాజేందర్‌రెడ్డి ఆఫీసుకు నన్ను పంపారని, అక్కడ చర్చల అనంతరం రూ.4లక్షలు ఇచ్చినా ఇంకా కావాలని ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. వ్యక్తిగతంగా నాకు శ్రీనాథ్‌రెడ్డికి ఎలాంటి గొడవలు లేవని, కేవలం డబ్బులు డిమాండ్ చేస్తూ, నా ఇంటిని కట్టుకోనివ్వకపోవడం వల్లనే న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించానని నానాజీ వివరించారు. శ్రీనాథ్‌రెడ్డి, సందీప్, టిపిఓ రాకేష్‌లపై చర్యలు తీసుకోవాలని నార్సింగి పోలీసులను కోరానని నానాజీ వివరించారు.

## జాతీయ అవార్డు అందుకున్న కాసర్ల శ్యామ్, సినీ నటుడు హేమ సుందర్‌లకు సత్కారం




కాసర్ల శ్యామ్, సినీ నటుడు హేమ సుందర్‌లను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 11 ప్రభాతవార్త:** సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్( కల్చరల్ వింగ్) నిర్వహణ లో ఇటీవల ఉత్తమ గీత రచయిత గా జాతీయ అవార్డు అందుకున్న కాసర్ల శ్యామ్ నాటి సినీ నటుడు హేమ సుందర్ ల సత్కార కార్యక్రమం శనివారం జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీ సంగీత దర్శకులు సాలూరి వాసు రావు హేమ సుందర్, శ్యామ్ లను మై హోమ్ అవతార్ సత్కరించి అభినందించారు. నిర్వాహకుడు రాధాకృష్ణ సామరస్యం సహృదయం కల వారు కాబట్టి హోం వారు అందరూ ఆయనకు సహకారం అందిస్తున్నారు అని అభినందించారు కాసర్ల శ్యామ్ మాట్లాడుతూ వరంగల్ నుంచి తెలంగాణ జానపద శైలిని పట్టుకుని తెలుగు చలన చిత్ర పరిశ్రమ లోకి అడుగు పెట్టిన తనకు జాతీయ పురస్కారం బలగం సినిమా లోని ఊరు పల్లెటూరు పాట కు రావటం తెలంగాణ జన పదం కు దక్కిన గౌరవం అన్నారు. శ్రీ శ్రీ, వేటూరి, సుధాల అశోక్ తేజ, చంద్ర బోస్ తరువాత ఐదవ తెలుగు వాడిగా జాతీయ పురస్కారం తన పాటకు వచ్చింది అని చెప్పారు నటుడు హేమ సుందర్ మాట్లాడుతూ గత కాలం లో ప్రముఖ నటులు తొలి రోజుల్లో నటన పరిణితి లేదని నేడు నటులు రెండు మూడు సినిమాల కు ప్రతిభావంత నటన చూపుతున్నారు అని చెప్పారు గాంధీ వ్యాఖ్యానం లో గణేష్ సూర్య శివ రంజని మధురమైన పాటలు పాడారు కార్యక్రమ నిర్వాహకుడు రాధాకృష్ణ జమలాపురం పర్యవేక్షణ చేశారు.

### ప్రజలబాధలో భాగస్వాములవుతున్న కిషోర్ రెడ్డి



బాధిత యువతిని పరామర్శిస్తున్న కిషోర్ రెడ్డి

**దుండిగల్, అక్టోబర్ 11, ప్రభాతవార్త**

ప్రార్ధించే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే లోకనీతిని నిజంచేస్తూ ప్రజల బాధలో భాగస్వాములవుతూ, ఎవరికి ఏ ఆపద వచ్చిన ముందుకు వచ్చి నేనున్నానంటూ ఆదుకుంటు తన ఉదారత, సేవాభావంతో బొంగునూరి కిషోర్ రెడ్డి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని చర్చిగాగిల్లాపూర్ గ్రామంలో నివసిస్తున్న మైనారిటీ యువతికి ఇటీవల మెదడులో రక్తం గడ్డకట్టిన సమస్య తలెత్తింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో వైద్యం అందించడం కష్టంగా మారింది. ఈ విషయాన్ని తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి తక్షణమే స్పందించారు. బాధిత యువతికి సిఎంఆర్ఎఫ్ ద్వారా అవసరమైన వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. సర్జరీవిజయవంతంగా పూర్తయ్యి, యువతి ప్రస్తుతం ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అవడంతో కిషోర్ రెడ్డి స్వయంగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆమె కుటుంబాన్ని ధైర్యం చెప్పడంతో పాటు రూ.10,000 ఆర్థిక సహాయం కూడా అందించారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, ఉమ్మడి ఖుత్బుల్లాపూర్ మండల సర్పంచ్ ల ఫోరం మాజీ అధ్యక్షులు, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్, శ్రీశైలం ముదిరాజ్, దొంతి మహేష్ ముదిరాజ్, క్రిష్ణ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డెక్కాలంటే ట్రాఫిక్ నరకం..!



**హైదరాబాద్, అక్టోబరు11, ప్రభాతవార్త**

నగరంలోని వాహనదారుల రాకపోకలు అసహనాన్ని తెప్పి స్తుంది. నడిరోడ్డుపై గంటలపాటు వేచి ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ట్రాఫిక్ ప్రాంతాల్లో పరిసరా ప్రాంతాల గల్లీలో నుంచి వెళ్లిపోతున్నారు. శనివారం బంజారాహిల్స్ అగ్రసేన్ మహారాజ్ క్రాస్‌రోడ్డులో ఫుల్ ట్రాఫిక్‌జాం ఏర్పడింది. వాహనాలను చూస్తే ఎందుకు వచ్చాము రా అనే అనక మానదు. అంతటి నరకం వాహనదారులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఉన్న ఎం చేయలేని పరిస్థితి.

## నటుడు శ్రీకాంత్ భరత్‌పై కేసు నమోదు

**హైదరాబాద్,అక్టోబరు11, ప్రభాతవార్త**

జాతిపిత మహాత్మాగాంధీపై సినీ నటుడు శ్రీకాంత్ భరత్ చేసినట్లుగా చెబుతున్న అనుచిత వ్యాఖ్యల వివాదం తీవ్ర రూపం దాల్చింది. ఈ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ వెంకట్ బల్మూరి, సదరు నటుడిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఆయన సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి, శ్రీకాంత్ భరత్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా వెంకట్ బల్మూరి మీడియాతో మాట్లాడుతూ, వాక్ స్వాతంత్రం పేరుతో కొందరు హద్దులు మీరుతున్నారని మండిపడ్డారు. గాడ్సే వారసులమని చెప్పుకునే వారే గాంధీజీపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. శ్రీకాంత్ భరత్ చేసిన వ్యాఖ్యలపై సినీ పరిశ్రమ పెద్దలు కూడా స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. త్వరలోనే మా మూవీ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణును కలిసి, శ్రీకాంత్ భరత్ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరతామని వెంకట్ బల్మూరి తెలిపారు.ఈ విషయాన్ని ఇంతటితో వదిలిపెట్టేది లేదని, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలో శ్రీకాంత్ భరత్‌పై ఫిర్యా దులు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే, పోలీసులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## సాలూరి రాజేశ్వరరావు సంగీతం నవరస భరితం

**-విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్**



ప్రముఖ గాయకుడు ఎర్రగొల్ల శ్రీనివాస్ యాదవ్‌కి సాలూరి ప్రతిభా పురస్కారాన్ని అందజేస్తున్న జస్టిస్ చంద్రకుమార్, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సాముద్రాల వేణుగోపాలాచారి, చిత్రంలో డాక్టర్ ఎం.కె.రాము తదితరులున్నారు.

**చిక్కడపల్లి, అక్టోబరు 11 ప్రభాతవార్త:** కవి రాసిన పాటకు అనువైన సంగీత స్వరాలు కూర్చిన సాలూరి రాజేశ్వరరావు సంగీతం నవ రస భరితం అని హై కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్ అన్నారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి నిర్వాహణలో విఖ్యాత సినీ గాయక సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావు 103 జయంతి సందర్భంగా ప్రముఖ గాయకుడు ఎర్రగొల్ల శ్రీనివాస్ యాదవ్‌కి సాలూరి ప్రతిభా పురస్కార ప్రదానోత్స వ సభ నిర్వాహక సంస్థ అధినేత, ప్రముఖ కవి డాక్టర్ ఎంకె.రాము అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ చంద్ర కుమార్, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి తో కలసి పురస్కారం బహుకరించి మాట్లాడారు. సాలూరి స్వర రచన చేసిన ప్రతి పాట ఆణిముత్యం అన్నారు. శ్రీనివాస్ యాదవ్ సాలూరి రాజేశ్వరరావు పురస్కారం అందుకోవటం విశేషం అని, వారి పేరు నిలపాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు, డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి మాట్లాడుతూ రసమయి సంస్థ సాలూరి రాజేశ్వరరావు స్వర రచనలు ముందు తరాలకి అందించటానికి చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి వాసు రావు మాట్లాడుతూ విఖ్యాత నటుడు నందమూరి తారకరామారావు, అమర గాయకుడు ఘంటసాల, సాలూరి రాజేశ్వరరావు శత జయంతి వొక ఏడాది లో వచ్చాయని గుర్తు చేశారు. పురస్కారం అందుకున్న శ్రీనివాస్ యాదవ్ గానం మధురం ఆయనకు సంగీతం పట్ల అంకిత భావన ఉందన్నారు. సంగీత దర్శకుడు పి వి సాయి బాబ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆశాలత వ్యాఖ్యానం లో రామాచారి శిష్య బృందం పాడిన సాలూరి రాజేశ్వరరావు స్వర రచన చేసిన పాటలు హృధ్యమము గా ఆలపించారు.

### తెలంగాణ జాతిని కవితలతో మేల్కొల్పిన మహాకవి సుద్దాల హనుమంతు : ఏనుగు నరసింహారెడ్డి



సుద్దాల హనుమంతుకు పుష్పాంజలితో ఘననివాళులర్పిస్తున్న నరసింహారెడ్డి తదితర కవులు, సిబ్బంది

**రవీంద్రభారతి, అక్టోబరు 11 ప్రభాతవార్త :** ప్రజాకవిగా, కళాకారుడిగా, ఎంతో క్రమశిక్షణతో జీవితమంతా కష్టజీవుల కోసం, కమ్యూనిస్టు ఉద్యమం కోసం అంకితంచేసి, తెలంగాణ జాతిని తన కవితలతో మేల్కొల్పి చైతన్యపరిచిన మహాకవి సుద్దాల హనుమంతు అని తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. సుద్దాల హనుమంతు వర్ధంతిని పురస్కరించుకొని రవీంద్రభారతి ప్రాంగణం కళాభవన్‌లోని తన కార్యాలయంలో పలువురు కవులు, రచయితలు, సాహితీవేత్తలు, సిబ్బందితో కలిసి హనుమంతు చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించి మాట్లాడారు. హనుమంతు కవితల్లో ఆవేశం, భావాల్లో సామాజిక స్పృహతో అర్థవంతంగా చేసే ఆలోచనే సుద్దాల కవితలని అభివర్ణించారు. హనుంతుకు ఎంతో ఆసక్తికరమైన ప్రజాకళారూపాలైన హరికథ, బుర్రకథ, యక్షగానాలే తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రచార సాధనాలుగా ఉపయోగపడ్డాయన్నారు. ఆయన బుర్రకథ చెబితే గడ్డిపోచ కూడా యుద్ధానికి సిద్ధమయ్యేదని జనంలో ప్రచారం బలంగా ఉండేదని, ఆయా కళారూపాల ద్వారానే ఆయన పీడిత వర్గాల బాధల్ని, భావాల్ని వ్యక్తీకరించేవారని తెలిపారు.

### రిఫా యే ఆమ్ ఉన్నత పాఠశాలకు ఘన చరిత్ర - బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్



రిఫాయే ఆమ్ ఉన్నత పాఠశాలలో కొత్త తరగతుల గదులను ప్రారంభిస్తున్న రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

**యాకుత్‌పుర,అక్టోబరు 11 ప్రభాతవార్త :**

తెలంగాణలో రిఫా యే ఆమ్ ఉన్నత పాఠశాలకు ఎంతో ఘన చరిత్ర ఉందని తెలంగాణ బి.సి.కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ అన్నారు.దాతల సహకారంతో పాతబస్తీలోని రిఫా యే ఆమ్‌ఉన్నత పాఠశాలలో నిర్మించిన ఐదు తరగుతుల గదులను ఆయన శనివారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలోహైదరాబాద్ జిల్లా విద్యా శాఖధికారి ఆర్. రోహిణి,పాఠశాల కరస్పాండెంట్ ఎస్.పుల్లారెడ్డి,పాఠశాల మేనేజ్‌మెంట్ ప్రెసిడెంట్ డా.ఆర్.వి.రామారావు,పాత విద్యార్థి సంఘం ఉపాధ్యక్షులు డా.ఎస్.విజయ్ భాస్కర్, బహదూర్‌పుర మండల డిప్యూటీ ఈఓ పొమ్య నాయక్, మేనేజ్ మెంట్ ఉపాధ్యక్షులు మిట్ట జనార్దన్,పాఠశాల ప్రధానోపాధ్యాయకులు నీరజ,వెంకట్‌రావు స్కూల్ ప్రధానోపాధ్యాయులు రేణు పాల్గొన్నారు.

### గణపతి దేవాలయం కమిటీ సభ్యుడు సాయికీర్తికి సత్కారం



శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, గణపతి దేవాలయం కమిటీ సభ్యుడు బింగి సాయికీర్తి(బాబ్జీ)లను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసి(క్రాస్‌రోడ్స్) లక్ష్మీగణపతి దేవాలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సింగరావు అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, గణపతి దేవాలయం కమిటీ సభ్యుడు బింగి సాయికీర్తి(బాబ్జీ) అభినందన సత్కార కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు జయేందర్‌బాబు, శిశుకుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు. బింగి సాయికీర్తి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన పథకాలను ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. జిహెచ్‌ఎంసికి ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ ఘనవిజయం సాధించడం తథ్యమని, అంతేకాకుండా జుబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికల్లో నవీన్‌యాదవ్ విజయం సాధించడం ఎప్పుడో డిసైడ్ అయిందని అన్నారు.

### డాక్టర్లు, అధికారుల వల్లనే వైద్యరంగం నిర్వీర్యం




మహాసభలలో ప్రసంగిస్తున్న వి.ఎస్.బోస్

**సైఫాబాద్, అక్టోబరు 11 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కొంత మంది డాక్టర్లు, అధికారులు వైద్యరంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఎఐటియుసి జాతీయ సీనియర్ నాయకుడు వి.ఎస్.బోస్ ఆరోపించారు. చాలా మంది డాక్టర్లకు ప్రైవేటు ఆసుపత్రుల్లో భాగస్వామ్యం ఉండటం వల్ల తమ స్వార్థం కోసం ఈ వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. శనివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 5వ మహాసభలలో ఆయన ప్రసంగించారు. పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యం, విద్య అందించాలంటే ఈ రెండు ప్రధాన రంగాలు ప్రభుత్వ ఆదీనంలోనే ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తగుచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సభలలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.డి.యూసఫ్, ఎస్.బాల్‌రాజ్, మెడికల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, ఇందిరా శ్రీలక్ష్మి, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.వేణుకుమార్, ఉపాధ్యక్షులు ఎంపిఎస్ రాజు, ఎం.ఎస్.మూర్తి, నాయకులు శ్రీనివాసచారి, నర్సయ్య శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు

### అదుపుతప్పి పండ్ల దుకాణంలోకి దూసుకొచ్చిన జీపు



**మలక్ పేట ,అక్టోబర్ 11, ప్రభాతవార్త:** అదుపుతప్పి పండ్ల దుకాణంలోకి జీపు దూసుకెళ్లిన సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ముసారాంబాగ్ డివిజన్ శాలివాహన నగర్ లో అదుపు తప్పిన జీపు పండ్ల దుకాణంలోకి దూసుకువెళ్లింది. ఏపీ వైజాగ్ నివాసి హరి (23) నగరానికి వచ్చి దిల్ షుక్ నగర్ శాలివాహన నగర్ కాలనీ నుంచి వెళ్తుండగా జీపు అదుపు తప్పింది. శాలివా హన నగర్ లో రోడ్డు పక్కన ఉన్న పండ్ల దుకాణంలోకి జీపు దూసుకెళ్తున్న క్రమంలో ఉప్పల్ నివాసి ప్రభాకర్ (60) స్టేషనరీ సప్లై చేసేందుకు తన యాక్టివా పై శాలి వాహన నగర్ కాలనీ నుంచి వెళ్తుండగా జీపు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ప్రభాకర్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే శాలివాహన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మలక్ పేట పోలీసులు హరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### వైభవంగా దుర్గాదేవి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న శంభీపూర్ క్రిష్ణ

**దుండిగల్, అక్టోబర్ 11, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లి 12వ వార్డు ఇందిరమ్మ కాలనీలోని నూతనంగా నిర్మించిన దుర్గాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దుర్గాదేవి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురా రోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్థిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నాగరాజు యాదవ్, మాజీ సర్పంచ్ కొమురయ్య యాదవ్, తాజా మాజీ కౌన్సిలర్ శివనూరి మల్లేష్, సీనియర్ నాయ కులు సగ్గడి శ్రీనివాస్, ఆకుల బాబు, బీఆర్ఎస్ మున్సి పల్ వైస్ ప్రెసిడెంట్ శివ యాదవ్, వార్డు ప్రెసిడెంట్లు సగ్గిడి న ర్సింగ్ రావు, శ్యామ్, మునిసిపల్ యూత్ ప్రెసి డెంట్ మైసి గారి శ్రీకాంత్, నాయకులు రామ్, రాజేష్, పరశురామ్, ఆల య కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### చింతల్ భగత్‌సింగ్‌నగర్‌లో భవాని సహసం -దొంగవెంటపడి తరిమికొట్టిన వైనం

**కుత్బుల్లాపూర్, అక్టోబరు 11 ప్రభాతవార్త**

చింతల్ జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని భగత్‌సింగ్ నగర్‌లో ఓ సాహస సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన భవాని తన ఇంట్లోనే మొదటి అంతస్తులో నివాసముంటుంది. క్రిందిపోర్షన్‌లో అద్దెకు ఉండేవారు తాళం వేసి బయటకు వెళ్లారు. అయితే ఇదే అదనుగా గుర్తుతెలియని దొంగ ఇంట్లో దొంగతనానికి యత్నిస్తున్నాడు. ఇది గమనించిన భవాణి పైనుండే ఎవరుని అడిగింది. దీనితో తడబడిన దొంగ తప్పించుకునేందుకు యత్నించాడు. ఇది గమనించిన భవాణి వెంటనే దొంగ ను వెంబడించింది. దొంగ దొంగ అని అరుస్తూ దొంగతనానికి యత్నించిన దొంగను పట్టుకునేంకుదు యత్నించింది. దీనితో ఒక అమ్మాయి తనను వెంబడిస్తుందని గుర్తించి దొంగ పెద్దఎత్తున పరుగుతీశాడు. వాడివెంటనే భవాణి కూడా పరుగెత్తుతూ దొంగను పట్టుకునేందుకు యత్నించి విఫలమమైంది. అయితే దొంగ తననైపుణ్యాన్ని ప్రదర్శించి పరుగెత్తడంతో దొంగను పట్టుకునేందఉకు చేసిన ప్రయత్నాలను అభినందించారు. ఒకబాలిక దొంగను పట్టుకునేందుకు చేసిన సాహసం స్థానికంగా ప్రజల్ని అబ్బురపరిచింది. ఈవిషయం తెలియ దంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు భగత్‌సింగ్ నగర్‌కు చేరుకుని స్థానికంగా అమర్చిన సిసి కెమెరాలను క్షుణ్ణంగాపరిశీలించి దొంగను గుర్తించేందుకు యత్నిస్తున్నారు. బాలిక చేసిన సాహసాన్ని అటు స్థానికులతోపాటు ఇటు పోలీసులు కూడా అభినందిం చారు. సుమారు 300వందలనుండి 400మీటర్లవరకు పరుగెత్తించిన తీరు స్థానికులనే అబ్బురపరిచింది. దొంగను కట్టుకునేందుకు బాలికచేసిన యత్నాన్ని అభినందిస్తున్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టింగ్‌కు దూరంగా ఉందాం

**రామచంద్రాపురం, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
భారత ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా స్వచ్ఛతా ప్రత్యేక ప్రచారం 5.0 దేశవ్యాప్తంగా అక్టోబరు2 నుంచి 31వ తారీఖు వరకు నిర్వహిస్తున్నారు. బిహెచ్ఈఎల్, రామచంద్రాపురంలో సైతం ప్రత్యేక శుభ్రతా ప్రచారం డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ప్రచారంలో భాగంగా బిహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఆడిట్ నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, ప్లాస్టిక్ వాడకంతో కలిగే హానికరమైన ప్రభావాలపై బిహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని దుకాణాల నిర్వాహకులకు అవగాహన కల్పించారు.

## రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 11 (ప్రభాతవార్త):**
బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 14న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బిసి సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము ఉమేష్‌యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిల హక్కు అయిన 42 శాతం రిజర్వేషన్‌ను పోరాడి కొట్లాడి తెచ్చుకుందామని, రాష్ట్ర బంద్‌లో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## బాబురావుకు డాక్టరేట్ అవార్డు..

**కంగ్టి, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
కంగ్టి మండలం దెగులవాడి గ్రామవాసి బొర్రన్ బాబురావుకు తమిళనాడులో గౌరవ డాక్టరేట్ అవార్డు దక్కింది. మారుమూల ప్రాంతంలో ఈయన చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ తమిళనాడు పాండిచ్చేరిలో గౌరవ డాక్టరేట్ ప్రకటించి సత్కరించారు. ఈ అవార్డుకు ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ గిబి నుంచి తనను నామినేట్ చేసిన గిబి స్టేట్ చైర్మన్ నవోదయ సిద్దుకు ధన్యవాదాలు తెలిపారు.

## మాత, శిశు ఆరోగ్యంపై అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న దృశ్యం

**టేక్మాల్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
మాత, శిశు సంపూర్ణ ఆరోగ్య రక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతూ ప్రతియేటా పోషకాహారం పై అవగాహనా కల్పిస్తూ మహిళా శిశు సంక్షేమశాఖ అధ్యర్యంలో పోషణ మాసోత్సవం నిర్వహిస్తుందని అంగన్వాడి టీచర్లు సరితా, ప్రవళిక దేవి అన్నారు. పోషణ పక్వాడాలో భాగంగా శనివారం టేక్మాల్ మండలం ఎల్లుపేట సెక్టార్‌లో ఎల్లంపల్లి అంగన్వాడి కేంద్రంలో పోషన్ అభియాన్ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అల్లాదుర్గం అధ్యర్యంలో పోషణ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పిల్లలు గర్భిణీలు, బాలింతలు, తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య సంరక్షణ పై గర్భిణీ స్త్రీలకు బాలింతలకు అవగాహన కల్పించమన్నారు. గర్భిణీలు తీసుకోవాల్సిన పోషకహారం, చిన్నపిల్లల అన్నప్రాసన ఆరోగ్య సంరక్షణపై క్లుప్తంగా వివరించామన్నారు. ఇందులో హెల్త్ ఏఎన్ఎం అనసూయ, అంగన్వాడి టీచర్లు సరితా, ప్రవళిక, దేవి, ఆయా బుజమ్మ, ఆశా వర్కర్ రాణి, గర్భిణీ స్త్రీలు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిని సన్మానిస్తున్న విజయ్

**కొండపాక, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము విజయ్‌కుమార్ సూచించారు. శనివారం కొండపాకలో రెండు రోజుల క్రితం మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా నియమితురాలైన మంజుల తిరుపతిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. కార్యకర్తలే పార్టీకి పట్టు కొమ్మలన్నారు. కార్యకర్తలు లేకుండా పార్టీలు మనుగడ సాగించలేవన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఏర్పుల మల్లేశం, నాయకులు మహేందర్, శ్రావణ్, నర్సింగరావు, నాగరాజు, కుంచవం రవీ, భానుచందు, కిషన్, సంజీవ్, వెంకట సాయి తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహప్రతిష్ఠాపనలో ఆవుల రాజిరెడ్డి


విగ్రహప్రతిష్ఠాపనలో పాల్గొన్న నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి

**వెల్దుర్తి, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
మండలంలోని అక్కమ్మపల్లి. దామరంచ గ్రామంలో శనివారం నాడు శ్రీ శివ పంచాయతన సహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్సాపూర్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు నరేందర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## రెండులక్షల ఎల్‌ఓసి అందజేసిన ఆవుల రాజిరెడ్డి

**వెల్దుర్తి, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
మండలంలోని ఉప్పు లింగాపూర్ గ్రామానికి చెందిన చాకలి వికాస్ గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురికావడంతో ఆయన చికిత్స కోసం శనివారం నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి రెండు లక్షల రూపాయల ఎల్‌ఓసి లెటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వికాస్ త్వరగా కోలుకోవాలని అన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం చేస్తున్న పథకాల ద్వారా ప్రతి ఒక్కరికి సహాయం అందిలా చూస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌ఓసి చెక్కు అందజేత

**శివ్వంపేట, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన జంగం రాజు భార్య జంగం జ్యోతి అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి విజ్ఞప్తి మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరు అయిన రూ 3లక్షల 50వేల ఎల్‌ఓసీ చెక్కును కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్‌గుప్తా చేతులమీదుగా అందజేశారు. ఆపదలో ఉన్న వారికి ఎల్‌ఓసీ చెక్కులు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు బాధితులు ఉన్నారు.

## మహంకాళి దేవాలయం వార్షికోత్సవంలో ఎమ్మెల్యే


అమ్మవారి వార్షికోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
పటాన్ చెరు డివిజన్ పరిధిలోని శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయం వార్షికోత్సవ కార్యక్రమానికి శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శనివారం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. దేవాలయం ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సపాన దేవ్, శంకర్ యాదవ్, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, నర్రా బిక్షపతి, ప్రకాష్‌రావు, నరసింహారెడ్డి, మాణిక్‌ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

## శబరిమల మహా పాదయాత్రల ఆహ్వానపత్రికల ఆవిష్కారం


ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న గూడెం మధుసూదన్‌రెడ్డి

**పటాన్‌చెరు, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
భక్తి, క్రమశిక్షణ, ఆధ్యాత్మిక సాధనలో అయ్యప్ప స్వామి మాలధారణ ఎంతో ప్రాముఖ్యమైనదని సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి అన్నారు. అమీన్ పూర్ మున్సిపాలిటీకి చెందిన దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అక్టోబర్ 24వ తేదీన, తెల్లాపూర్ మున్సిపాలిటీకి చెందిన శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అక్టోబర్ 17వ తేదీ నుండి బిహెచ్ఇఎల్ అయ్యప్ప స్వామి దేవాలయం నుండి శబరిమల దేవస్థానం వరకు చేపట్టనున్న మహా పాదయాత్రల ఆహ్వానపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ప్రస్తుత సమాజంలో మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, పెద్ద రాజు, వెంకటేష్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, పాదయాత్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మాస్యూటికల్ పరిశోధనలో డాక్టర్ కిషోర్‌కుమార్‌కు పిహెచ్‌డి

**పటాన్‌చెరు, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థి బి.కిషోర్ కుమార్‌ని డాక్టరేట్ వరించింది. ఎంచుకున్న క్యాన్సర్ నిరోధక ఔషధాల కోసం నానోబబుల్ సాంకేతికతను ఉపయోగించి అల్ట్రాసౌండ్‌సహాయక ఔషధ పంపిణీ వ్యవస్థ అభివృద్ధిపై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ శనివారం ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ కిషోర్ కుమార్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పిహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు పేర్కొన్నారు.

## ఆపదకాలంలో అండగా నిలుస్తున్న ఆరోగ్యశాఖమంత్రి తనయ

**టేక్మాల్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
టేక్మాల్ మండల పరిధిలోని సాలోజిపల్లి గ్రామానికి చెందిన కొడపాక సాయమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిన్న సాయంత్రం మరణించారు. స్థానిక మండల నాయకులు ఈ విషయాన్ని త్రిష దృష్టికి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న ఆరోగ్యశాఖామంత్రి కూతురు త్రిష వెంబడే స్పందించి తక్షణ సహాయం కింద అంత్యక్రియల నిమిత్తం కొంత నగదు మండల నాయకుల ద్వారా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని ఆధ్వర్యపదొద్దని భరోసానిచ్చారు. ఇందులో మండలపార్టీ అధ్యక్షుల రమేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సంగమేశ్వర్‌గౌడ్, యువనాయకులు సర్వని లక్ష్మణ్, వెంకట్‌గౌడ్, స్థానిక నాయకులు సామేల్, గ్రామపార్టీ అధ్యక్షులు చంద్రయ్య, యూత్ అధ్యక్షుడు వేముల యాదగిరి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఆసరాగా సురక్ష సేవాసంఘం

**-బాధితులకు ఆర్థిక సహాయం**

**రామచంద్రాపురం, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
అనారోగ్యంతో అవస్థలు పడుతున్న రామచంద్రాపురంకు చెందిన సురేష్, నక్షత్రలకు సురక్ష సేవాసంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపి శంకర్ యాదవ్ ముత్తూర్ ఫైనాన్స్ సంస్థ సిఎస్ఆర్ విభాగం సహకారంతో బాధితులకు 30వేల రూపాయల ఆర్థిక సహాయం అందచేశారు. ముత్తూట్ ఫైనాన్స్ సిఎస్ఆర్ మేనేజర్ లక్ష్మణ్ సమన్వయంతో పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి చేతులమీదుగా బాధితులు సురేష్‌కు 10వేలు, నక్షత్రకు 20వేల రూపాయల ఆర్థికసహాయం అందచేశారు. కార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ సిఎస్ఆర్ ఫండ్స్ మేనేజర్ లక్ష్మణ్, సంగారెడ్డి జిల్లా సురక్ష సంఘం ఇంచార్జి హారతి, బిఆర్ఎస్ నాయకులు జగన్నాథ్‌రెడ్డి, పటాన్‌చెరు సోషల్ మీడియా కన్వీనర్ రవి కిరణ్‌రెడ్డి, సర్కిల్ యూత్ నాయకులు నరసింహా, కృష్ణ, షకిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శించిన జిఎంఆర్ టీం సభ్యులు

**నారాయణఖేడ్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
కల్హేర్ మండలం ఖానాపూర్ కె గ్రామానికి చెందిన ఉప్పరి మాణిక్ ప్రభు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న జిఎంఆర్ ఫౌండేషన్ టీం సభ్యులు వారినివాసానికివెళ్లి పరామర్శించి ఆర్థికసహాయం అందించారు. ఈసందర్భంగా జిఎంఆర్ టీం సభ్యులు మాణిక్‌ప్రభుని ధైర్యపరుస్తూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజల పట్ల తమ సేవా మనసును మరోసారి చాటుకున్న జిఎంఆర్ ఫౌండేషన్ టీం అందరికీ ఆదర్శంగా నిలుస్తోందని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపూర్ తాజా మాజీ ఎంపీటీసీ అంజయ్య సాగర్, కృష్ణాపూర్ తాజా మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకుల రాములు, ఖానాపూర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాలరాజ్, జర్నలిస్ట్ పండరి సాగర్, జీఎంఆర్ ఫౌండేషన్ సభ్యులు పరశురాంరెడ్డి, శ్రీనివాస్‌సాగర్, కొసంగి లక్ష్మయ్య, పండరి తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలు కుటుంబాన్ని పరామర్శించిన ఆవుల రాజిరెడ్డి

**వెల్దుర్తి, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తిలో శనివారం నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి మృతురాల కుటుంబాన్ని పరామర్శించారు. గురువారం వెల్దుర్తి వార్త విలేకరి పరమేశ్వర్ తల్లి పెంటము నర్సమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఈవిషయం తెలుసుకున్న టిపిసిసి కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి శనివారం ఆకుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

**చిన్నశంకరంపేట, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
మండల పరిధి జంగరాయికి చెందిన మోహన్, గజగట్లపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనారోగ్య సమస్యలతో బాధపడుతు మృతి చెందగా ఈ విషయం తెలుసుకున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షురాలు పద్మారెడ్డి బాధిత కుటుంబాలకు రూ.5వేల ఆర్థిక సహాయం పంపగా బిఆర్ఎస్ నాయకులు అందించారు. కార్యక్రమంలో నాయకులు రవిందర్, ప్రభాకర్, నాగభూషణం, రాజ్, నరేష్‌గౌడ్, శంకరయ్య, యాదగిరి, మదుసుధన్, సురేష్, శ్రీనివాస్ తదితరులున్నారు.

## జననేత జయప్రకాష్ నారాయణ

**తెలంగాణ అడ్వకేట్ జెఎసి నేత పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

**ముషీరాబాద్, అక్టోబర్ 11, ప్రభాతవార్త:**
భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడిన జననేత జయప్రకాష్‌నారాయణ శ్రీవాత్సవ్ అని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ నేత పులిగారి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. శనివారం జయప్రకాష్‌నారాయణ 113వ జయంతి సందర్భంగా కవాడిగూడలోని కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈసందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యోద్యమంలో పాలుపంచుకున్న జేపీ నారాయణ గాంధేయవాది అని, ఆయన క్విట్ ఇండియా మూమెంట్‌లో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. స్వార్థపూరిత రాజకీయాలను సహించలేని జయప్రకాష్ నారాయణ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీని స్థాపించారని, సామాన్యులకు సమన్యాయం జరగాలన్నదే ఆయన లక్ష్యమని తెలిపారు. 1975లో ఎమర్జన్సీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఏకం చేసి, జనతాపార్టీ స్థాపించటమే కాకుండా 1977లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్‌ను ఓడించి, జనతాపార్టీ అధికారం చేపట్టటంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు.

## ఓటు చోరీ సంతకాల సేకరణలో పాల్గొన్న కూన శ్రీనివాస్ గౌడ్

**జీడిమెట్ల, అక్టోబర్ 11, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్, బాలాజీ లేఔట్‌లో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగమయి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఓటు చోరీ సంతకం ప్రచారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కెకెఎం ట్రస్ట్ చైర్మన్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. అనంతరం కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రజాసౌమ్య దేశంలో ఓటు హక్కు అనేది బలమైన ఆయుధమని అన్నారు. రానున్న రోజుల్లో ఓటు చోరీ కాకుండా ప్రతి ఒక్కరు వారికి సంబంధించిన బస్తిలలో ఓటర్ జాబితా, ఛాయాచి త్రాలను జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకుడు బుచ్చిరెడ్డి, వాసు, శ్రీనివాస్ రెడ్డి, అంజి, ప్రసా ద్, నరేష్ గౌడ్, ఉషారాణి, సుజాత, సత్తుపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గాజులరామారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు బాధ్యతలు

**హైదరాబాద్, అక్టోబర్ 11, ప్రభాతవార్త:**
బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శిగా డాక్టర్ ఎన్.గౌతమ్ రావు బాద్యతలు చేపట్టారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన గౌతంరావు శనివారం అంబర్‌పేటలోని మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భారీ ర్యాలీతో రాష్ట్ర కార్యాలయానికి చేరుకుని, బాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీని రాష్ట్రంలో మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని, వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో సైతం బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు,పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి : జోషి, శ్రీగణేష్

**కంటోన్మెంట్,అక్టోబర్ 11 ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపికలో భాగంగా శనివారం నగరానికి విచ్చేసిన ఏఐసీసీ పరిశీలకులు సిపి.జోషిని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మె ల్యే ఎన్.శ్రీగణేష్ స్వాగతం పలుకుతూ అభినందనలు తెలిపారు. ఈ సందర్బంగా శ్రీగణేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కాంగ్రె స్ పార్టీ బలోపేతానికి కాంగ్రెస్ కార్యకర్తలు,నాయకులు కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. సికింద్రాబాద్ జిల్లాను కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా నిలుపాలని ఏసిఐసీసీ పరిశీలకులు జోషి సూచించారు. ఈ కార్యక్ర మంలో రాజ్య సభ సభ్యుడు అనీల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## 7వ వార్డు అభివృద్ధికి కృషి : శ్యామ్

**కంటోన్మెంట్,అక్టోబర్ 11 ప్రభాతవార్త:**
7వ వార్డులోని వివిధ ప్రాంతా ల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి బోర్డు సిఈఓ దృష్టికి తెచ్చి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని 7వ వార్డు మాజీ బోర్డు మెంబర్ ప్యారసాని శ్యామ్ కుమార్ తెలిపారు. తిరుమల గిరి విలేజ్‌లో గత కొన్ని రోజులుగా పవర్‌బోర్ వెల్ పాడైంది.దాంతో మంచినీటి తీవ్ర ఇబ్బంది ఉండడంతో స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే కంటోన్మెంట్ బోర్డు వాటర్ వర్క్బ విభాగం ఇంజనీర్ రాజ్‌కుమార్ దృష్టికి తీసుకు రాగా బోరు మరమ్మత్తులు చేయించారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు రాజారెడ్డి, ఉమేశ్, గోవింద్ రాజ్, సూరి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లను బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు అడ్డుకుంటున్నాయి

**హైదరాబాద్ అక్టోబరు 10 ప్రభాతవార్త:**
తెలంగాణలో బీసీలకు 42శాతం రిజ ర్వేషన్లు ఇవ్వాలనే ప్రభుత్వ ప్రయత్నాలను బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అడ్డుకుంటున్నాయని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నవాబ్ ముజాహిద్ అలంఖాన్ ఖాన్ విమర్శించారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వుపై హైకోర్టు తాత్కాలిక స్టే ఇవ్వడం బీసీ సమాజానికి నిరాశ కలిగించినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ న్యాయ వ్యవస్థను గౌరవిస్తుందని, అన్ని చట్టపరమైన ఆధారాలతో కోర్టులో తమ వాదనను సమర్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో నిరంతరం నిబద్ధతతో, చట్టబద్ధమైన విధానంలో పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, గవర్నర్, ప్రతిపక్ష పార్టీలు అయిన బీజేపీ, బీఆర్ఎస్ సహకరించకపోయినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మరియు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బీసీల హక్కుల కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తిగా స్పష్టతతో మరియు చట్టబద్ధంగా అమలు చేసినట్లు ఆయన చెప్పారు. బీసీలకు సంబంధించిన కుల వారీ లెక్కలు సేకరించడానికి కులగణన చేపట్టడం, బీసీ కమిషన్ ద్వారా వివరాలను రూపొందించడం జరిగిందని వివరిం చారు. బీసీలకు తగిన రిజర్వేషన్లు అందించేందుకు ప్రభుత్వం న్యాయపరమైన చర్యలను కొనసాగిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ బీసీ సమాజం పక్షానే నిలుస్తుందని, రాజ్యాంగ పరిధిలోనే 42శాతం రిజర్వేషన్లు సాధించేందుకు కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. బీసీ సమాజం ధైర్యం కోల్పోకుండా, ఏకమై ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్య క్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య చట్టపరమైన మార్గాల్లో ఈ లక్ష్యాన్ని సాధించే వరకు పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

## మోండా డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : దీపిక

**అడ్డగుట్ట,అక్టోబర్ 11 ప్రభాతవార్త:**
మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. బండిమెట్టులో కొనసాగుతున్న సీసీరోడ్డు నిర్మాణం పనులను ఆమె పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షులు ప్రశాంత్, జిత్తూ, కమిటీ సభ్యులు అరుణ్, గణేష్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో ఘనంగా మహా భజన సప్తాహ కార్యక్రమం

**కూకట్‌పల్లి, అక్టోబర్ 11, ప్రభాతవార్త**
కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని మూసాపేట్‌లోని శ్రీ పాండురంగ భజన మండలి వారి ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న మహా భజన సప్తాహ కార్యక్రమం ఘనంగా కొనసాగుతోంది. ఈ సప్తాహ భజనోత్సవంలో దేశంలోని పలు ప్రాంతాల నుండి ప్రసిద్ధ భజన మండలి సంస్థలు, హరిదాసులు పాల్గొని భక్తిరస గీతాలతో భక్తులను ఆహ్లాద పరుస్తున్నారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు శ్రీ పాండు రంగ భజన మండలి అధ్యక్షులు సూర్యనారాయణ కశీనాథ సూర్యకర్ ఆహ్వానం మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు వడ్డేపల్లి రాజేశ్వరరావు మూసాపేట్‌లోని శ్రీ పాండు రంగ విట్టల స్వామివారి ఆలయాన్ని సందర్శించి స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుకి ఘన స్వాగతం పలికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ భక్తి, ఆధ్యాత్మికత సత్సంగ స్ఫూర్తిని ప్రజల్లో నింపే ఉద్దేశ్యంతో ఇలాంటి భజన సప్తాహాలు నిర్వహించబడటం ఎంతో శుభపరిణా మం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ వాస్తవ్యులు సప్పిడి శ్రీనివాసరావు, కేబుల్ శ్రీనివాస్, పాండు రంగ భజన మండలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై ప్రభుత్వం ఉక్కుపాదం

**జీడిమెట్ల, అక్టోబర్ 11, ప్రభాతవార్త**
ప్రమాదాల నియంత్రణ కొరకు పరిశ్రమలు కట్టుబడి ఉండాలని, ప్రతి కార్మికుని ప్రాణం ఎంతో విలువైంది.. కాపాడాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని డైరెక్టర్ అఫ్ ఫ్యాక్టరీ స్ డిప్యూటీ చీఫ్ వై మోహన్ బాబు స్పష్టం చేశారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్ లో కౌన్సిల్ ఆఫ్ ఈ హెచ్ ఎస్ ప్రొఫెషనల్స్ (సిఈపి) ఆధ్వర్యంలో పలు పరిశ్రమల ఉద్యోగులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ తరగతులలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పరిశ్రమలో ప్రతికార్మికుడు భద్రత పట్ల శిక్షణ పొందేటట్లు యాజమాన్యం శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ తరగ తుల వల్ల ప్రమాదాల నివారణ చాలావరకు తగ్గుతుందని ఆయన అన్నారు. ప్రతి పరిశ్రమ జీరో ప్రమాదాల స్థాయికి చేరినప్పుడే పరిశ్రమ అభివృద్ధి సాధించినట్లు అవుతుందని, భద్రత ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, వారిపై ఉక్కుపాదం మోపుతుందని హెచ్చరించారు. కౌన్సిల్ ఆఫ్ ఈ హెచ్ ఎస్ ప్రొఫెషనల్స్ (సిఈపి) వారు నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఆరోబిందో అండ్ ఆపిటోరియా ఫార్మా ఈ హెచ్ ఎస్ జనరల్ మేనేజర్ అమర్ కూడాలే, బిఎస్ అండ్ బి సేఫ్టీ సిస్టమ్స్ చెన్నై రాష్ట్ర అధ్యక్షుడు బి జయ, శంకర్, గ్రాన్యూవల్స్ ఇండియా లిమిటెడ్ ఈ హెచ్ ఎస్ వైస్ ప్రెసిడెంట్ మెట్లపల్లి శ్రీనివాస్, 3ఎం జనరల్ మేనేజర్ ఏ సందీప్ కుమార్, వియాష్ లైఫ్ సెన్స్ ఈహెచ్ఎస్ వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ సాంసన్, కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ (సిఈ పి) సభ్యులు ఏ సూర్యప్రకాష్, ఈ తిరుపతి, పి రామకృష్ణ, చంద్రకాంత్, జి జగదీష్, ఏ మురళీకృష్ణ, హరిబు కీయతోపాటు పరిశ్రమల ప్రతినిధులు ఈ శిక్షణ తరగతులలో పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ముషీరాబాద్, అక్టోబర్ 11, ప్రభాతవార్త:** ఫుట్‌పాత్‌పై నివసించే గుర్తు తెలియని వ్యక్తి (60) మృతి చెందిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 8వ తేదీ ఉదయం పదకొండు గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి దోమలగూడ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద అపస్మారక స్థితిలో పడిఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న దోమలగూడ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని, అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని చూసి, 108కు ఫోన్ చేశారు. 108 సిబ్బంది వచ్చి, ఆ వ్యక్తిని పరీక్షించి, అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు ధృవీకరించారు. గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని గాంధీ హాస్పటల్‌కు తరలించి, మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

## దారి దోపిడీ కేసును ఛేదించిన నర్సాపూర్ పోలీసులు

**-దారి దోపిడీకి పాల్పడ్డ ముగ్గురు అరెస్ట్**



నిందితులను మీడియాకుచూపిస్తున్న జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు

**నర్సాపూర్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
కారులో లిఫ్ట్ ఇస్తామని చెప్పి నగదును, అకౌంట్లో డబ్బులను కాజేసిన రేసును నర్సాపూర్ పోలీసులు ఛేదించారు. ఈమేరకు ఈ దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసిన సంఘటన నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది.

ఈ కేసుకు సంబంధించిన వివరాలను అడిషనల్ ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ రంజితకుమార్‌లతో కలిసి జిల్లా ఎస్పీ డీ.వీ శ్రీనివాసరావు శనివారం మెదక్ ఎస్పీ కార్యాలయంలో వివకాలను వెల్లడించారు. ఈమేరకు ఎస్పీ డి.వి శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 7వ తేది మధ్యరాత్రి నర్సాపూర్ పట్టణంలో ఓ కారులో ముగ్గురు వ్యక్తులు వచ్చి సంగారెడ్డి రోడ్డులో ఒంటరిగా స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని ఆపి అతనిని చేతులతో కొట్టి అతని నుండి రూ.350 నగదు, పర్సు లాక్కొన్నారు. అలాగే అదే రాత్రి గొర్రెల కాపరులైన ఇద్దరు వ్యక్తులకు లిఫ్ట్ ఇస్తామని చెప్పి నర్సాపూర్ పట్టణంలోని మెదక్ మార్గంలో బస్టాప్ వద్ద కారులో ఎక్కించుకొని మార్గమధ్యలో కారును ఆపి వారిని చేతులతో కొట్టి చంపుతామని బెదిరించి వారి వద్ద నుండి రూ.2500 నగదు, ఫోన్ పే నుండి రూ.5550 కాజేశారు. ఇట్టి కేసులోని నేరస్తులను సాంకేతిక ఆధారాలను ఉపయోగించి జగద్గిరిగుట్ట లోని ఆల్విన్ కాలనీలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని తదుపరి అరెస్ట్ చేయడం జరిగింది. ఈ నేరాలని పాల్పడిన వారిలో నీలగిరి దశరథ్ (21), నార్సింగి గ్రామం, పాపన్నపేట్ మండలం, మెదక్ జిల్లా, బుర్నోటి ఆగమయ్య(21), లింగంపల్లి గ్రామం, రేగోడ్ మండలం, మెదక్ జిల్లా, అలాగే దన్నారం కృష్ణ(20) కోరంపల్లి గ్రామం, టేక్మాల్ మండలం, మెదక్ జిల్లా వాసులుగా పోలీసులు గుర్తించడం జరిగింది. పైన తెలిపిన నిందితులు ముగ్గురు ఈ నెల 7వ తేదిన ఉదయం 7 గంటలకు సుమిత్ అనే వ్యక్తి వద్ద నుంచి స్విఫ్ట్ కారును కిరాయికి తీసుకొని దశరథ్ సొంత ఊరైన నార్సింగికి వాళ్ళ నాన్నను చూడడానికి వచ్చారు. నార్సింగి నుండి రాత్రి 12 గంటల సమయంలో హైదరాబాద్‌కు బయలుదేరి మార్గం మధ్యలో నర్సాపూర్ దగ్గరలో గల క్లాసిక్ గార్డెన్ వద్దకు రాగానే ఒంటరిగా స్కూటీపై వెళ్తున్న మేకల కొండయ్య అనే వ్యక్తిని ఆపి అతనిని చంపుతామని బెదిరించి అతని వద్ద రూ.350, పర్సు, ఫోన్ దొంగలించారు. అనంతరం నర్సాపూర్ చౌరస్తా మెదక్ మార్గంలో నిలబడిన గొర్రె కాపరులైన రేణిపట్ల నరసింహా, బజారు రామప్పకి కారులో లిఫ్ట్ ఇస్తామని కారులోకి ఎక్కించుకొని కొంత దూరం వెళ్ళాక వాళ్ళను చంపుతామని బెదిరించి వారి వద్ద నున్న రూ.2500 నగదు, ఫోన్ పే నుండి రూ.5500 కాజేశారు. ఈ మేరకు నిందుతుల నుండి స్విఫ్ట్ కారు, మూడు మొబైల్ ఫోన్లు పోలీసులు స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. సవాలుగా మారిన ఈ దారి దోపిడి కేసు వెలికితీతలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ జాన్ రెడ్డి, ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి, మరియు సిబ్బంది శ్రీకాంత్, ఉపేంద్ర, బాగయ్య లు సమర్థవంతంగా పనిచేసి దొంగలను చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేయడం జరిగింది. అదేవిధంగా దొంగ సొత్తును స్వాధీనం చేయడంలో విశేష కృషి చేశారు.

## సీతారామ దేవాలయ నిర్మాణానికి అంకురార్పణ



సీతారామచంద్ర స్వామి దేవాలయ నిర్మాణ నమూనా చిత్రం

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
సిద్దిపేట జిల్లా కేంద్రంలో మరో సీతారామచంద్రస్వామి దేవాలయ నిర్మాణానికి అంకుర్పణ చేయబోతున్నారు. భద్రాచలం రామాలయ తరహాలో సువిశాలంగా 2ఎకరాల విస్తీరణంలో ఆలయంనిర్మించడానికి నిర్వాహకులు సన్నహాలు చేస్తున్నారు. ఆలయం పట్టణానికి ఏదిశలో ఉంటే ప్రజలకు, భక్తులకు శ్రేయస్కరమో తదితర విషయాలపై వేదపండితులతో చర్చించారు. ఈమేరకు ఆలయనిర్మాణానికి ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ఇంటింటికి రామాలయ నిర్మాణానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు ప్రధాన కూడలీలలో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణం హైదరాబాద్ రోడ్డులో చేపట్టడానికి నిర్వాహకులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే ఆధ్యాత్మికకేంద్రానికి నిలయమైన సిద్దిపేటలో ధార్మిక కార్యక్రమాలు పెద్దయెత్తున కొనసాగుతున్నాయి. ఇప్పటికే సీతారామచంద్ర స్వామి దేవాలయ నమూనా తయారు చేయించారు. ఈక్రమంలో జిల్లా కేంద్రంలో మరో సీతారామచంద్రస్వామి ఆలయానికి అంకురార్పణ జరగనుండడంతో భక్తులు, ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

## డాక్టరేట్ పట్టా అందుకున్న ఓంప్రకాష్

**నాగల్‌గిద్ద, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఉట్‌పల్లి గ్రామానికి చెందిన డి.ఓంప్రకాష్ గ్లోబల్ హుమెన్ పీస్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా ఓవైపు, మరోవైపు సామాజిక సేవలు (రక్తదానం) చేస్తూ సమాజానికి తన వంతు అందిస్తున్న సేవలను గుర్తించి తనకు డాక్టరేట్ ప్రకటించడం ఆనందంగా ఉందని ఓంప్రకాష్ ఆనందం వ్యక్తంచేశారు. తనకు డాక్టరేట్ పట్టా వచ్చేలా సహకరించిన ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ తెలంగాణరాష్ట్రం నుంచి తనపేరును పంపిన సంస్థ రాష్ట్రచైర్మన్ నవోదయ సిద్దుకు, రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ డిగ్గే బాబుకు ఓంప్రకాష్ ధన్యవాదాలు తెలిపారు.

## ఫేక్ కాల్‌ను నమ్మకండి-సిఐ

**సిర్గాపూర్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
డీప్‌ఫేక్‌కాల్స్ నుంచి అధికారులు, రాజకీయ పార్టీల నాయకులుగా మాట్లాడుతున్నట్లు ఎఐ ద్వారా ఫేక్ వీడియో కాల్స్ వస్తే సైబర్ ఫ్రాడ్‌కాల్‌గా గుర్తించాలని సిఐ వెంకటరెడ్డి పేర్కొన్నారు. తమ డబ్బులు కాజేయడానికి సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త ఎత్తుగడలు వేస్తూ మాయజాలం చేస్తున్నారని, తెలిసిన నాయకుడి నుంచి మీకు కాల్స్ చేసినట్లు సాయం చేయాలని నమ్మించి ఫేక్ కాల్స్ చేసి డబ్బులు కాజేస్తారని సిఐ వెంకటరెడ్డి పేర్కొన్నారు.

## ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేయాలి



నిరసన తెలుపుతున్న ముగ్గురు పిల్లల తండ్రులు

**మర్కుక్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
స్థానికసంస్థల ఎన్నికల్లో ఇద్దరుపిల్లల నిబంధనను ఎత్తివేయాలని కోరుతూ ముగ్గురుపిల్లల తండ్రులు శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రప్రభుత్వం స్థానికసంస్థల ఎన్నికల్లో ఇద్దరుపిల్లల నిబంధనలు రద్దుచేసి ఇద్దరికంటే ఎక్కువమంది పిల్లలు ఉన్నవారుసైతం స్థానిక ఎన్నికల్లో పోటీచేసేందుకు అర్హత కల్పించాలని కోరారు. పక్కరాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరుపిల్లల నిబంధన ఎత్తివేసినట్లు మనరాష్ట్రంలో కూడా అదేవిధంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురుపిల్లల తండ్రుల జెఏసి ఏర్పాటుచేసి ఉద్యమం ఉధృతంచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలచంద్రం, కనకయ్య, సత్యం, శ్రీశైలం, మంకేష్‌స్వామి, సత్యం, బాబు, వెంకట్, మొండిస్వామి, మహేష్, నరేందర్, భాస్కర్, నర్సింహారెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## బడిని...తల్లిదండ్రులను మరువరాదు

-కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్

**నారాయణఖేడ్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
విద్యనేర్పిన బడిని, తల్లిదండ్రులను, గురువులను మరువరాదని కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి, అఖిలభారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్ అన్నారు. శనివారం నారాయణఖేడ్ పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలో 2008-9 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు జన్మనిస్తారు. గురువులు మార్గనిర్దేశకులు అవుతారన్నారు. సరస్వతీ శిశుమందిరాలు దేశసంస్కృతిని కాపాడడమే కాకుండా విద్యార్థులకు సంస్కారాన్నందిస్తున్నాయన్నారు. పూర్వవిద్యార్థులు, ఆచార్యులకు సన్మానంచేయడం, పాఠశాల అభివృద్ధికి సహకరించడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమం లో శిశుమందిర్ పూర్వ ప్రధానాచార్యులు, ఆచార్యులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులతో బాలల పథసంచాలన్


రూట్‌మార్చ్ చేస్తున్న చిన్నారులు

**అమీన్‌పూర్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
అమీన్‌పూర్‌మండలం బీరంగూడనగర్‌శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ శతాబ్ది ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టారెడ్డిపేటలో సుమారు 200మంది 5నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సుగల చిన్నారులతో బాలల పథసంచాలన్‌ను ఆకర్షణీయంగా నిర్వహించారు. కార్యక్రమానికిముందు కాషాయపతాకాన్ని ఎగురవేసి, దేశభక్తి నినాదాలతో పథసంచాలన్‌ను ప్రారంభించారు. కిలోమీటరు మేర గ్రామవీధుల గుండా చిన్నారులు రూట్‌మార్చ్ నిర్వహించారు. తమ పిల్లలను ఇలాంటికార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడమే గర్వకారణమని తల్లిదండ్రులు పేర్కొన్నారు. పిల్లల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావంవంటి విలువలను బలపరచడం సమాజబాధ్యత అని సంఘ్‌సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు స్వయం సేవకులు పాల్గొన్నారు.

# సదాశివపేట పట్టణ అభివృద్ధికి శాయాశక్తుల కృషిచేస్తా

-మున్సిపల్ అధికారులతో సమీక్షాసమావేశంలో జగ్గారెడ్డి


సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**సదాశివపేట, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
సదాశివపేట పట్టణ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషిచేస్తానని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కందకం రోడ్డు పనుల కోసం పురపాలక సంఘం అధికారులతో సమీక్షాసమావేశం ఏర్పాటుచేశారు. శనివారం పట్టణంలోని కందకం రోడ్డు పనులకు పురపాలక సంఘం అధికారులతో సమీక్షాసమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి. టిజిఐ ఐసి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డిలు పాల్గొని అధికారులతో కలిసి కందకం రోడ్డు పరిశీలించి, అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. జగ్గారెడ్డి మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ.20కోట్లు 2014లో నేనే తెచ్చిన, ఇప్పుడు నేనే పూర్తిచేయాల్సి వస్తుందన్నారు. సదాశివపేటపట్టణం కందకం రోడ్డు పొడవు 2.5 కిలోమీటర్లు కల్వర్టులతో సహా దాదాపు పని పూర్తయిందని, ఈశ్వరమందిర్ దగ్గర ఏడు ఇళ్ళ తొలగింపులో సమస్య ఉందని, వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామంటే వారు ఒప్పుకోవడం లేదని, దానికి బదులుగా ఇంటిస్థలం, ఇల్లు నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారని అధికారులు, స్థానిక నాయకులు జగ్గారెడ్డితో పేర్కొన్నారు. కందకం రోడ్ 2014 జనవరిలో ఉమ్మడిరాష్ట్రంలో మంజూరయితే, ఇప్పటివరకూ ఎందుకు పూర్తిచేయలేకపోయారని అధికారులను జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉమ్మడిరాష్ట్రంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, మున్సిపల్‌మంత్రి మహీధరరెడ్డి ఉన్నప్పుడు, స్పెషల్‌జిఓ తెచ్చి రూ.20కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. 11 సంవత్సరాలలో రూ.15కోట్లు ఖర్చుచేశారు. ఇప్పటికీ పూర్తి చేయలేకపోయారు. 2014లో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కందకంరోడ్డు కోసం రూ.20కోట్లు తెస్తే ఇంకా రూ.5కోట్ల పనులు ఈ 11ఏళ్లలో పూర్తిచేయలేక పోయారన్నారు. 2014లో నేను తెచ్చిన రూ.20కోట్ల జిఓకు, 11ఏళ్ల తర్వాత మళ్లీ నేనే ఇప్పుడు రివ్యూచేయాల్సి వస్తుందంటే సదాశివపేట ప్రజలు ఆలోచించాలన్నారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ దగ్గరకు వెళ్ళి ఎన్నోసార్లు అడిగామని, ఆకుంపటి మనకెందుకు అని, వదిలేయమని చెప్పి పట్టించుకోలేదని జవాబిచ్చారు. మంత్రి హరీష్‌రావు దృష్టికి సైతం కందకం రోడ్డు విషయం తీసుకెళ్లామని, నిర్వాసితుల సమస్య తీర్చమని అడిగామని జగ్గారెడ్డికి వివరించారు. నిర్వాసితులకు డబుల్ బెడ్ రూంలు తప్ప వేరే ఏపరిహారం ఇచ్చేదిలేదని హరీష్‌రావు చెప్పారని, కందకం రోడ్ సమస్యను ఇటు చింతా ప్రభాకర్, అటు హరీష్‌రావు పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. ఇప్పుడు మా ప్రభుత్వం ఉంది. సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు నా మాట వింటారు. నిధులు తెచ్చే అవకాశం ఉంది. కాబట్టి నేను మళ్ళీ కందకంరోడ్‌పై రివ్యూ చేస్తున్నా అన్నారు. 8మంది నిర్వాసితులకు ఒక్కొక్కరికి 150గజాలస్థలం, స్లాబ్ ఉన్నవారికి రూ.15లక్షలు, రేకులు ఉన్నవారికి రూ.10లక్షల పరిహారం ఇచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రోడ్ వెడల్పు విషయంలో స్థానికులకు కావాల్సిన పరిహారం ఎంత? వారు ఏం కోరుకుంటున్నారో తెల్సుకుని ప్రతిపాదన సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యస్థలాల్లో జంక్షన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదన సిద్ధంచేయాలన్నారు. కోర్టుకేసులు ఉన్నప్లేస్‌లలో వదిలి, మిగతా చోట పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ గడిల రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కంది కృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, మాజీ బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పట్నం సుభాష్, మాజీ కౌన్సిలర్లు. గుండు రవికుమార్, వాజిద్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, చిరు, బిట్ల ప్రేమ్‌కుమార్, కోడూరు శరత్‌చంద్ర, చోటుబాయ్, ఇంజనీర్ రాజేష్, సంబంధిత అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాస్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్నవారిని కఠినంగా శిక్షించాలి


నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి భూషణ్‌రామకృష్ణ గవాయిపై ఛాందసవాది చెప్పువిసరడాన్ని అత్యున్నత న్యాయస్థానాన్ని అవమానించడమేనని నవజీవన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు మొలుగు బాలరాజు, ప్రధానకార్యదర్శి కర్రె స్వామిలు అన్నారు. జిల్లాకేంద్రంలోని బిజెఆర్ భవన్‌లో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈదురదృష్టకర సంఘటనను దేశ ప్రజలందరూ తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ఈసందర్భంగా నవజీవన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సభ్యులు ఎస్.కనకయ్య, పి.మల్లేశం, కె.మల్లేశం, కె.రవి, నవీన్, యాదగిరి, రవి, గంగాధర్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ లోపాలను సవరించి వెంటనే బిల్లులు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శెట్టిపల్లి సత్తిరెడ్డి దృశ్యం

**కొమురవెల్లి, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
ఇందిరమ్మ ఇళ్ల ఆన్‌లైన్‌లో ఉన్న లోపాలను పరిష్కరించి లబ్దిదారులకు బిల్లులు చెల్లించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల పరిధిలోని 11 గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. ఇంటి నిర్మాణ పనులు చేపట్టి పూర్తికావస్తున్నా, ఆన్‌లైన్‌లో ఫోటో క్యాప్సూల్స్, ఓటిపి రావటంలేదని తదితర కారణాలతో లబ్దిదారులకు బిల్లులు రావడం లేదన్నారు. దీంతో లబ్దిదారులు వడ్డీవ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు ఇందిరమ్మ ఇళ్ల ఆన్‌లైన్‌లో ఉన్న లోపాలను సవరించి లబ్దిదారులకు బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు తాడూరి రవీందర్, తాడూరి మల్లేశం, నీల బిక్షపతి, ఉల్లంపల్లి సాయిలు, ఆరుట్ల రవీందర్, ఉల్లపల్లి నర్సవ్వ, తాడూరి భరత్‌కుమార్, దాసరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మెట్రోలో ప్రయాణించిన ఎమ్మెల్సీ

**రామచంద్రాపురం, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి హైద్రాబాద్‌లోని నాంపల్లి మెట్రో స్టేషన్ వరకు బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి ప్రయాణించారు. నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీకార్యక్రమంలో అంజిరెడ్డి పాల్గొన్నారు. మెట్రోలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి ప్రయాణిస్తూ మెట్రో అందిస్తున్న సేవలను, అందించాల్సిన సేవలను ప్రయాణీకులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చొరవతో హైద్రాబాద్‌లో చాలా ప్రాంతాలకు మెట్రోసేవలు అందుతున్నాయన్నారు. ప్రయాణీకులు సురక్షింగా త్వరితగతిన గమ్యస్థానాలకు చేరుకుంటున్నారని, ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలుతీసుకోవాలని మెట్రో అధికారులకు ఎమ్మెల్సీ అంజిరెడ్డి సూచించారు.

## రెండు కుటుంబాల ఘర్షణను రాజకీయం చేయొద్దు

-బిజెపి మండలశాఖ అధ్యక్షులు సంతోష్


ఏడుపాయల్లో మాట్లాడుతున్న బిజెపి మండలశాఖ అధ్యక్షులు సంతోష్

**పాపన్నపేట, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
ఇటీవల నాగ్సాన్పల్లిలో రెండు కుటుంబాల మధ్య జరిగిన దాడిలో ఓ వ్యక్తి మరణించగా, దాన్ని కొంతమంది రాజకీయం చేసేందుకు ప్రయత్నించడం తగదని జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్దాస్ మల్లేశంగౌడ్, మండలశాఖ అధ్యక్షులు సంతోషాచారి ఖండించారు. శనివారం వారు ఏడుపాయల్లో విలేకరులతో మాట్లాడుతు నాగ్సాన్పల్లిలో జరిగినసంఘటనలో మరణించినవ్యక్తి కుటుంబాన్ని వరామర్శించడానికి వచ్చిన మజ్లీస్ బచావో తహరీక్ స్పోక్స్ పర్సన్ అంజదుల్లాఖాన్ మెదక్ ఎంపి రఘునందన్‌రావుపై అసత్య ఆరోపణలు చేశాడని అన్నారు. రఘునందన్‌రావు గెలిచిన తర్వాత మత విద్వేషాలు పెరిగాయని ఆరోపించడం శుద్ధ అబద్ధమన్నారు. అంజదుల్లాఖాన్‌పై పాపన్నపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం శ్రీనివాస్, బైండ్ల సత్యనారాయణ, రంజిత్‌రెడ్డి, మండలనాయకులు ఉన్నారు.

## బిసిల జీవితాలతో చెలగాటమాడితే సహించం

-జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి

**గజ్వేల్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
స్థానికసంస్థల ఎన్నికలతోపాటు విద్య, ఉద్యోగనియామకాల్లో బిసి రిజర్వేషన్ల అమలుకు కలిసిరాని రాజకీయపార్టీలకు పుట్టగతులుండవని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరిముదిరాజ్ అన్నారు. శనివారం గజ్వేల్‌పట్టణంలో ఏర్పాటుచేసిన మీడియాసమావేశంలో మాట్లాడుతూ కోర్టులను అడ్డుపెట్టుకొని 42శాతం రిజర్వేషన్‌ను అడ్డుకున్నారని, వారికి రాజకీయ భవిష్యత్తు ఉండదని స్పష్టంచేశారు. బిసిల జీవితాలతో చెలగాటమాడితే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. బిసిరిజర్వేషన్ అమలుకు ప్రతి ఒక్క రాజకీయపార్టీ సహకరించాలన్నారు. అసెంబ్లీలో ఆమోదం పొందినప్పటికీ గవర్నర్, రాష్ట్రపతి వద్ద బిసి బిల్లు పెండింగ్‌లో ఉండడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రపతి, గవర్నర్ వద్ద ఉన్న పెండింగ్ బిల్లుల ఆమోదానికి సిఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నించకపోవడం సరైందికాదన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నర్సింహాచారి, న్యాయవాది శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రైతులకు మద్దతు ధర అందించాలి

-మొక్కజొన్న పంటను అమ్ముకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్న రైతులు
-పట్టింపులేని రాష్ట్ర సర్కార్
-బిఆర్ఎస్ రాష్ట్రనాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి


రైతులతో కలిసి మాట్లాడుతున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
గత కొద్దిరోజులుగా యూరియా కోసం చెప్పులు, పాస్‌బుక్‌లు లైన్‌లోపెట్టి పడిగాపులుకాసిన రైతులు ప్రస్తుతం పండించిన పంటను అమ్ముకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నా, రాష్ట్ర సర్కార్ మాత్రం పట్టించుకున్న పాపానపోవడంలేదని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో మొక్కజొన్న పంటను అమ్ముకోవడానికి రైతులు పడుతున్న ఇబ్బందులను శనివారం అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యార్డులో మొక్కజొన్నపంటను అమ్ముకోవడానికి రైతులు 20రోజులుగా పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. రైతులుపడుతున్న ఇబ్బందులను దృష్టిలోపెట్టుకొని వెంటనే మార్కెట్‌యార్డులో రాష్ట్ర సర్కార్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని డిమాండ్‌చేశారు. రాష్ట్ర సర్కార్ మొక్కజొన్న కొనుగోలుకేంద్రాలను ఏర్పాటుచేయకపోవడంతో రైతులు తక్కువధరకు దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతులకు మద్దతుధర అందించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ప్రభుత్వానికి లేఖలు రాసినా పట్టించుకోవడంలేదన్నారు. ఉమ్మడిరాష్ట్రంలో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడ్డారో నేడు కాంగ్రెస్‌పాలనలో అవే ఇబ్బందులు పడాల్సివస్తుందని అన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు మద్దతుధర అందించకుంటే మాజీ సిఎం కెసిఆర్, మాజీమంత్రి హరీష్‌రావు పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు దరిపల్లి శ్రీను, సంతోష్, రైతులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ములుగు, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
ములుగు మండలపరిధిలోని కొక్కొండ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈనెల 12వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్‌శాఖ ఎఈ శ్రీనివాస్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి బస్వాపూర్ ఇండస్ట్రియల్, 11 కెవి సింగన్నగూడ ఎజిఎల్‌ఫీడర్లపై విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

## విద్యుత్ సిబ్బందిని అభినందించిన ఏడిఈ


చెరువుమధ్యలోని స్తంభంపై మరమ్మతులుచేస్తున్న విద్యుత్‌సిబ్బంది

**ములుగు, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
ములుగు మండలపరిధిలోని బండమైలారం గ్రామంలోగల చెరువుమధ్యలో ఉన్న విద్యుత్ స్తంభంపై ఏర్పడిన సమస్యను విద్యుత్‌శాఖ సిబ్బంది పరిష్కరించడం పట్ల ఏడిఈ శ్రీనివాసులు, ఏఈ శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండమైలారం సబ్‌స్టేషన్ నుండి 11 కెవి కొత్తూర్ ఎజిఎల్ ఫీడర్‌పై 11కెవి డిస్క్, ఇన్సులేటర్ ఫెయిల్ కావడంతో విద్యుత్ అంతరాయం జరిగిందని, చెరువుమధ్యలో ఉన్న స్తంభంపై ఈసమస్య ఏర్పడడంతో విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ బాలయ్య, జూనియర్ లైన్‌మెన్ కరుణాకర్, ఆర్‌టిజిఎస్ ప్రభాకర్‌లు ప్రాణాలకుతెగించి చెరువుమధ్యలో ఉన్న స్తంభంపైకి ఎక్కి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినందుకు రైతులుసైతం విద్యుత్ అధికారులను అభినందించారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంచేస్తే ఆందోళనలు చేస్తాం

ఎబివిపి జిల్లా కన్వీనర్ : సావుల ఆదిత్య



విలేకరులతో మాట్లాడుతున్న ఎబివిపి నాయకులు

**హుస్నాబాద్‌టౌన్, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఇలాకాలో విద్యార్థులు నాణ్యమైనవిద్యకు ఇబ్బందులుపడడంతోపాటు విద్యారంగ సమస్యలతో సతమతమవుతున్నారని ఎబివిపి జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో విద్యావస్థను నిర్వీర్యం చేయకుండా అభివృద్ధిచేయాలని డిమాండ్‌చేశారు. హుస్నాబాద్ పట్టణంలో బాలికల, మహిళాజూనియర్ కళాశాలలలో మౌలికసదుపాయాలు కల్పించాలన్నారు. రెండుకళాశాలలు పురాతనమైనవని మరమ్మతుచేసి సుందరీకరణ చేసి విద్యార్థులకు అందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల అద్దె భవనంలో కొనసాగుతున్నాయని వెంటనే పక్కా భవనాలు నిర్మించాలన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలో జూనియర్‌కళాశాలను ఏర్పాటుచేయాలన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితంమాత్రం శూన్యమన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంచేస్తే ఆందోళనలు చేస్తామన్నారు. సమావేశంలో ఎబివిపి జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేష్, నగర కార్యదర్శి భీమగోని చరణ్, ఉపాధ్యక్షులు రాహుల్, సంయుక్త కార్యదర్శి అంజి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గేదెను తప్పించబోయి చెట్టును ఢీకొట్టిన కారు

-ముగ్గురికి గాయాలు

**కొండపాక, అక్టోబరు 10, ప్రభాతవార్త:**
శనివారం హైదరాబాద్ నుండి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు కొండపాక స్టేజి రవీంద్రనగర్‌వద్దకు రాగానే అకస్మాత్తుగా రోడ్డుపైకివచ్చిన గేదెను తప్పించబోయి కారు రోడ్డుక్రిందకు దూసుకపోయి ఎదురుగా ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈసంఘటనలో కారులో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మరొకరికి స్వల్పగాయాలైనట్లు 108సిబ్బంది తెలిపారు. గాయాలపాలైన వారిని చికిత్స చేయించడానికి సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

**జోగిపేట, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
మద్యానికి బానిసై ఓయువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలపరిధిలోని చింతకుంటలో శనివవారం జరిగింది. ఇందుకు సంబంధించి జోగిపేట ఎస్ఐ పాండు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతకుంట గ్రామానికి చెందిన నిరుడి బాలరాజ్(22) అనే యువకుడు ఈనెల 10న ఇంటినుంచి వెళ్లిపోయాడు. మద్యానికి బానిసైన అతను ఎంతకీ ఇంటికి తిరిగిరాకపోవటంతో చుట్టుపక్కల వెతికినప్పటికీ దొరకకపోవటంతో, వెతకగా చింతకుంట శివారులోని పొలంవద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఆశమ్మ ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పాండు తెలిపారు.

## వృద్ధురాలినుంచి దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

-నిందితుడి నుంచి పలు ఆభరణాలు, బైకు స్వాధీనం
-జోగిపేట సిఐ అనిల్‌కుమార్


అరెస్ట్ చేసిన నిందితుడిని చూపుతున్న పోలీసులు

**జోగిపేట, అక్టోబరు 11, ప్రభాతవార్త:**
వృద్ధురాలిని చంపుతానని బెదిరించి ఆమెవద్ద ఉన్న కాళ్లకడియాలు, బంగారుమాటీలు గుంజుకున్న పాత నేరస్థుడిని అరెస్ట్‌చేసి, అతనినుంచి పలు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు జోగిపేట సిఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన శనివారం వెల్లడించారు. సంగారెడ్డికిచెందిన మంగళి సత్యమ్మ తనచెల్లెలిదగ్గరకు వెళ్లేందుకు సంగారెడ్డిలోని శుక్రవారం అడ్డాకూలీలుండే చోట నిలుచోవటంతో, అక్కడకువెళ్లిన చిలిపిచెడ్ మండలం బంజారనగరతాండకు చెందిన రమావత్ బన్సిలాల్ తనబైక్‌పై సంగారెడ్డిలోని అడ్డాకూలీలుండే చోటుకువెళ్లి మంగళి సత్యమ్మతో తానుకూడా అటేవెళ్తున్నానని నమ్మించి, ఆమెను తన బైక్‌పై ఎక్కించుకొని తాడాదాన్‌పల్లి చౌరస్తా దాటగానే గొంగ్లూరు గ్రామ శివారులో ఆమెనుబెదిరించి, సత్యమ్మవద్దనుంచి కాళ్లకడియాలు, బంగారు మాటీలు గుంజుకుని పరారయ్యాడు. మంగళి సత్యమ్మ ఫిర్యాదుమేరకు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అదుపులోకితీసుకొని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించాడని, ఇతనిపై బైకుల దొంగతనం కేసు, రేప్, ఒకహత్య, దోపిడీ కేసులున్నట్లు సిఐ అనిల్‌కుమార్ తెలిపారు. కాగా, అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు.